


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 84, పేజీలు - 08

శుక్రవారం, ఆగష్టు 29, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# వరద బాధిత ప్రాంతాల్లో సీఎం ఏరియల్ సర్వే



## సహాయకచర్యలు వేగవంతం చేయాలని ఆదేశం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గత ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ పనికిరాకుండా పోయిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌లతో కలిసి ఆయన ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టే మనకు ప్రాణవాయివు అని, గోదావరి జలాల విషయంలో ఇది చాలా కీలకమన్నారు. చాలా వ్యూహాత్మక ప్రాంతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టును నిర్మించారని వివరించారు. కూలిపోయిన ప్రాజెక్టు, నిలబడిన ప్రాజెక్టుల మధ్య చాలా తేడా ఉందన్న రేవంత్ రెడ్డి ఇంజినీరింగ్ నిపుణులు సూచించిన చోటనే ఎల్లంపల్లిని నిర్మించారని, నిపుణులు కట్టిన ప్రాజెక్టు కనుకే దశాబ్దాల పాటు నిలబడిందన్నారు. మేడిగడ్డ విషయంలో సాంకేతిక కమిటీ సూచనలతో ముందుకు వెళ్తామని రేవంత్ రెడ్డి చెప్పారు. అనంతరం మెదక్ జిల్లా పర్యటించిన సీఎం అక్కడి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

### ఒకరు స్వాతి ముత్యం, మరొకరు ఆణిముత్యం

మేడిగడ్డ పనికిరాకుండా పోయిందని, రిపేరు చేయకుండా అన్నారం, సుందిళ్లలో నీరు నిల్వ చేయొచ్చు కదా? అని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సీఎం రేవంత్ రెడ్డి సమాధానమిచ్చారు. అతి తెలివితేటలతో మామ, అల్లుడు ఒకరు స్వాతి ముత్యం, మరొకరు ఆణిముత్యం అనుకుంటారని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. మేడారం, అన్నారం, సుందిళ్ల మూడు బ్యారేజీలు ఒకే రకమైన సాంకేతిక నైపుణ్యంతో నిర్మించారని చెప్పారు. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తి అన్నారంలో పోయాలి అని, అక్కడి నుంచి సుందిళ్ల, శ్రీపాద ఎల్లంపల్లిలో పోయాలన్నారు.

2లో..

# మోదీ చైనా పర్యటనకు అంతా సిద్ధం

## - ఏడేళ్ల తర్వాత డ్రాగన్ దేశంలో టూర్

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రధానమంత్రి మోదీ ఏడేళ్ల తర్వాత తొలిసారిగా చైనాలో పర్యటించనున్నారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు రెండు రోజులు పర్యటిస్తారు. టియాంజిన్‌లో షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్సీఓ) శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు, ఇక్కడ కీలకమైన ప్రాంతీయ, భద్రతా అంశాలు చర్చల్లో ఆధిపత్యం చెలాయించే అవకాశం ఉంది.



ఈ వారం చివరిలో చైనా పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశం కానున్నారు, ఇది ఏడు సంవత్సరాల తర్వాత ఆ దేశంలో మోదీ చేస్తున్న తొలి పర్యటన.

### వాణిజ్యం -ప్రాంతీయ అనుసంధానంపై దృష్టి

2020 హింసాత్మక సరిహద్దు ఘర్షణల నుంచి భారత్-చైనా సంబంధాలు

2లో..

# పథకాల కోసం కుటుంబాలు విడిపోకూడదు

## - ఫ్యామిలీ బెనిఫిట్ మానిటరింగ్ వ్యవస్థపై సీఎం సమీక్ష

- ఆధార్ తరహాలో కొత్త కార్డుల జారీకి ప్రభుత్వం నిర్ణయం - ప్రభుత్వ పథకాల వివరాలన్నీ ఇకపై ఒకే కార్డులో నమోదు
- రైతు బజార్ల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశం

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. గురువారం అమరావతి సచివాలయంలో ఫ్యామిలీ బెనిఫిట్ మానిటరింగ్ వ్యవస్థపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్డు ఆధార్ తరహాలో ఉంటుందని, ఇందులో ప్రభుత్వ సంక్షేమ పథకాలతో సహా కుటుంబానికి సంబంధించిన అన్ని వివరాలు

2లో..



# మోదీ కూడా ఓట్ల దొంగతనానికి పాల్పడ్డారు

- బీహార్‌లో రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర'.
- బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కై ఓట్లు తొలగించారని రాహుల్ ఆరోపణ
- రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయని వ్యాఖ్య



**పాట్నా (ప్రశ్న న్యూస్)** ఎన్నికల సంఘం, బీజేపీ కుమ్మక్కై ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు.

2లో..

# ఉప్పునిప్పులా ఉండే లీడర్లు ఎదురుపడితే.?

## చిటపటల్లేవు.. చిరునవ్వుల ముచ్చట్లే

**సిరిసిల్ల (ప్రశ్న న్యూస్)** రాజకీయాల్లో వారిద్దరూ ఎప్పుటూ ఒకరిపై ఒకరు సెటైర్లు వేసుకుంటూ ఉంటారు. తీవ్ర ఆరోపణలు చేసుకుంటూ ఉంటారు. వారిద్దరూ ఎదురుపడితే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించడం కష్టమని అనుకుంటూ ఉంటారు. కానీ అలాంటివేమీ ఉండవని వారి మధ్య నవ్వుల, పువ్వులు పూస్తాయని తాజాగా జరిగిన ఘటనతో వెల్లడి అయింది. వరదల కారణంగా సిరిసిల్ల నియోజకవర్గంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలను పరామర్శించి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ సిరిసిల్లలో పర్యటిస్తున్నారు. సిరిసిల్ల కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది.



ఆ నియోజకవర్గ ఎంపీ బండి సంజయ్ కావడం ఆయన కేంద్ర మంత్రిగా కూడా ఉండటంతో ఆర్మీ హెలికాప్టర్లను కూడా పిలిపించి సహాయ కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్నారు. సిరిసిల్ల నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా కేటీఆర్ ఉన్నారు. ఆయన కూడా నియోజకవర్గ పరిస్థితిని పరిశీలించేందుకు సిరిసిల్ల వెళ్లారు. అక్కడ వాగులో చిక్కుకున్న వారిని హెలికాప్టర్ల

2లో..

# ఏ ఒక్క దివ్యాంగునికీ అన్యాయం జరగదు

## - నకిలీ పింఛన్‌లే తొలగిస్తామన్న చంద్రబాబు

**అమరావతి (ప్రశ్న న్యూస్)** "అర్హులైన దివ్యాంగులకు పెన్షన్ లు తొలగించం. ఏ ఒక్కరికీ అన్యాయం జరగదు" అన్నారు సీఎం చంద్రబాబు. తెలుగు ప్రజలకు సంక్షేమాన్ని పరిచయం చేసింది తెలుగుదేశం పార్టీనేనని ఆయన అన్నారు. "దేశంలో మరే ఇతర రాష్ట్రంలో ఇవ్వనంత స్థాయిలో పెద్ద ఎత్తున పింఛన్లు ఇస్తున్నాం. సామాజిక భద్రత, వృద్ధాప్య పెన్షన్లును రూ 30 నుంచి రూ. 4000 వరకు మనమే తెచ్చాం. ప్రస్తుతం వృద్ధులకు ఇస్తున్న రూ. 4000 పెన్షన్ మొత్తంలో టీడీపీ ప్రభుత్వాలు రూ. 2875 పెంచాయి. దివ్యాంగులకు గత ప్రభుత్వం రూపాయి కూడా పింఛను పెంచలేదు. వైసీపీ ప్రభుత్వానికి నోరెత్తి మాట్లాడే అర్హత లేదు. దివ్యాంగుల పెన్షన్లను రూ. 500 నుంచి రూ. 6000 చేసింది టీడీపీ ప్రభుత్వాలే. అలాగే డయాలసిస్ రోగులకు రూ. 10 వేలకు పెంచింది టీడీపీనే.. ఇస్తోంది టీడీపీనే. మంచానికే పరిమితమైన వారికి పెన్షన్లు ఇవ్వడం మొదలు పెట్టిన టీడీపీ ప్రభుత్వమే దాన్ని రూ. 15 వేల వరకు పెంచింది. 63 లక్షల మంది లబ్ధిదారులకు ప్రతి నెలా 1వ తేదీనే ఇస్తున్నాం. ఏడాదికి సుమారు రూ.35 వేల కోట్లు పింఛన్లకే ఖర్చు చేస్తున్నాం." అని

2లో..



# తెలంగాణ క్రీడాపాలసీలో సమూలమైన మార్పు

## - ఏ పోటీలకైనా ఆతిథ్యం ఇచ్చేందుకు రెడీ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఖేలో ఇండియా, కామన్ వెల్త్, ఒలింపిక్స్ ఇలా ఏ పోటీలు నిర్వహించినా వాటిలో తెలంగాణకు అవకాశం కల్పించాలని తెలంగాణ స్పోర్ట్స్ హబ్ తీర్మానం చేసింది. రాష్ట్రంలో స్టేడియాల నిర్వహణ, వసతులు మెరుగుపర్చడం, కోచ్‌లు, ట్రైనర్‌లకు శిక్షణ, క్రీడా పాలసీలో వివిధ అంశాలపై ప్రణాళిక రూపకల్పన, అమలుకు సబ్ కమిటీల ఏర్పాటుకు బోర్డు తీర్మానాలు చేసింది. తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు మొదటి సమావేశం హైదరాబాద్‌లో గురువారం జరిగింది.

2లో..




# హైదరాబాద్ వాసులకు చిల్లింగ్ న్యూస్

## - కొత్వాల్ గూడలో కృత్రిమ బీచ్ ప్రాజెక్ట్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ అందమైన నగరం. ఉపాధికి, విద్యకు లోటు లేదు. అలాగే వినోదాలకూ హద్దు ఉండదు. కానీ ఒక్కటే లోపం అదే బీచ్ లేపోవడం. హైదరాబాద్ సముద్రం ఒడ్డున లేదు కనీసం వంద కిలోమీటర్ల దూరంలోనూ లేదు. అందుకే బీచ్ అనేది హైదరాబాద్ వాసులకు లోటు. అందుకే అప్పుడప్పుడూ రాజకీయ నేతలు హైదరాబాద్ కు బీచ్‌ను తెస్తామని హామీలిస్తారని సెటైర్లు పడుతూంటాయి. కానీ ఇప్పుడు

2లో..

# ఆర్టికల్ 200 ఏం చెబుతోంది.?

## - సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు

- సుప్రీంకోర్టుకు రాష్ట్రపతి ముర్ము 14 ప్రశ్నాంశాలతో లేఖాస్త్రం
- విచారణ కొనసాగిస్తోన్న ఐదుగురు జడ్జిల రాజ్యాంగ ధర్మాసనం
- ఆర్టికల్ 200లోని వీలైనంత త్వరగానే అనే పదంపై ప్రస్తావన

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) శాసనసభ ఆమోదించి పంపిన బిల్లులకు గవర్నర్లు సమ్మతి నిరాకరించి వాయిదా వేస్తూ కూర్చుంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 200లో పేర్కొన్న 'వీలైనంత త్వరగా' (As Soon As Possible) అన్న పదానికి అర్థం ఉండదని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన బిల్లులకు ఆమోదం తెలిపే విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు కోర్టులు గడువు విధించగలవా? అంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లేవనెత్తిన అంశంపై విచారిస్తోన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు

2లో..



# 75 ఏళ్లకు తప్పుకోమని నేను ఎవరికీ చెప్పలే

## - మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు

- తానుగానీ, ఇతరులుగానీ రిటైర్ అవ్వాలని ఎప్పుడూ చెప్పలేదన్న భగవత్
- ప్రధాని మోదీని ఉద్దేశించి వ్యాఖ్యలు చేయలేదని వెల్లడి
- గతంలో చేసిన వ్యాఖ్యలను తప్పుగా అన్వయించుకున్నారని వివరణ

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** రాజకీయాల్లో, సంస్థల్లో 75 ఏళ్లకు పదవీ విరమణ చేయాలని తాను వ్యాఖ్యానించినట్లుగా జరుగుతున్న ప్రచారంపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ స్పష్టతనిచ్చారు. తాను గానీ, మరే ఇతర రాజకీయ నాయకులు గానీ 75 ఏళ్లకు రిటైర్ అవ్వాలని ఎన్నడూ చెప్పలేదని ఆయన తేల్చి చెప్పారు. వచ్చే నెలలో ప్రధాని నరేంద్ర మోదీ 75వ ఏట అడుగుపెడుతున్న నేపథ్యంలో, గతంలో

2లో..



## వరద బాధిత ప్రాంతాల్లో సీఎం ఏరియల్ సర్వే

3 బ్యారేజీల డిజైన్‌లో, నిర్మాణంలో, నిర్వహణలో లోపం ఉందని ఆయన వివరించారు. ఏదైనా ప్రమాదం జరిగితే గ్రామాలకు గ్రామాలు తుడిచిపెట్టుకుపోతాయని అన్నారు. వరద పరిస్థితిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్న సీఎం పలు సూచనలు చేశారు. మూడు బ్యారేజీల్లో నీటినిల్వ, ఎత్తిపోతలు క్షేమం కాదని ఎన్డీఎస్ఏ(నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ)చెప్పిందన్నారు. నీరు నిల్వచేశాక మొత్తం కూలిపోతే గ్రామాలు కొట్టుకుపోతాయని రేవంత్ వెల్లడించారు.

### వరద పరిస్థితులపై అధికారులతో సీఎం సమీక్ష

ఎల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి అక్కడి నుంచి మెదక్ జిల్లా పర్యటనకు వెళ్లారు. వరద పరిస్థితులపై మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. సుమారు 45 నిమిషాలపాటు జరిగిన ఈ మీటింగ్లో పలు అంశాలకు సంబంధించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. వరద ముప్పు ఇంకా పోలేదని అప్రమత్తంగా ఉండాల్సిందేనని ఆయన అధికారులకు స్పష్టం చేశారు. ప్రభావిత ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు సహాయక చర్యలను చేపట్టాలని ఆదేశించారు. పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. రోడ్లు తెగిన చోట యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి రవాణా సౌకర్యాన్ని పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్కుమార్తో పాటు మెదక్ ఎంపీ రఘునందన్రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### సీఎంకు ఎంపీ రఘునందన్ విజ్ఞప్తి

మెదక్ పట్టణం పిల్లికొట్టాల్‌లో నీట మునిగిన సబ్ స్టేషన్‌కు బదులు మరో కొత్త సబ్ స్టేషన్ మంజూరు చేయాలని ఎంపీ రఘునందన్రావు సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. మెదక్ నుంచి కామారెడ్డి వెళ్లే రహదారిని నాలుగు లేన్లుగా మార్చాలని, నిన్న నీటమునిగిన రామాయంపేట హాస్టల్ భవనాన్ని మరో చోట నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూనే విపత్తు నిధులను కేంద్రం నుంచి తేవాలని రఘునందన్రావును కోరారు.

## మోదీ చైనా పర్యటనకు అంతా సిద్ధం

దెబ్బతిన్నాయి. ఇప్పుడు వాటిని సరి చేసి ఘర్షణ తగ్గించి, ఆర్థిక దౌత్యపరమైన సంబంధాలను బలోపేతం చేయడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. దీని కోసం రెండు వర్గాల నుంచి ముందడుగు పడింది. ఈ శిఖరాగ్ర సమావేశంలో భారతదేశం ప్రాథమిక లక్ష్యాలలో సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను సమర్థిస్తూ వాణిజ్యం, అనుసంధానతను పెంచడం. ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో రెండు ఆసియా శక్తులు సంబంధాలను పునరుద్ధరించగలవా లేదా అనే దానిపై యావత్ ప్రపంచ ఆసక్తిగా ఎదురు చూస్తోంది. మోడీ సమావేశంలో ఏం జరగబోతోందనే ఉత్కంఠ నెలకొంది.

### భౌగోళిక రాజకీయ నేపథ్యం: సుంకాలు -ఉద్రిక్తతలు

ప్రపంచ వాణిజ్య ఘర్షణతో, ముఖ్యంగా ఆగస్టు 27 నుంచి భారత దిగుమతులపై అదనంగా 25 శాతం సుంకాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన వేళ మోదీ పర్యటనపై ఆసక్తి పెరుగుతోంది. రష్యా ముడి చమురు కొనుగోలుపై వాషింగ్టన్ విమర్శలు చేయడంతో న్యూఢిల్లీ మళ్లీ దౌత్యపరమైన ఒత్తిడికి గురైంది. అమెరికా చర్యలతో ఒత్తిడిలో ఉన్న బారత్‌కు చైనాతో సంబంధాలు వ్యూహాత్మక ఎంపికగా విశ్లేషకులు చెబుతున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశంగా తన స్థానాన్ని మరింత బలోపేతం చేయడానికి సహాయపడతాయని

### ఎస్సీఓ సమ్మిట్: రికార్డు స్థాయిలో పాల్గొనే అవకాశం

రష్యాపై పాశ్చాత్య ఆంక్షలు, పెరుగుతున్న వాణిజ్య వివాదాల నేపథ్యంలో టియాంజిన్ సమ్మిట్‌ను చైనా గ్లోబల్ సౌత్ సంఘీభావానికి నిదర్శనంగా భావిస్తోంది. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకారం, ఈ సంవత్సరం సమావేశం 2001లో ఏర్పడినప్పటి నుంచి ఎస్సీఓ చరిత్రలో అతి పెద్దది అవుతుంది. ఈ శిఖరాగ్ర సమావేశం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సహా 20 మందికిపైగా ప్రపంచ నాయకులను, మధ్య ఆసియా, దక్షిణాసియా, మధ్యప్రాచ్యం ఆగ్నేయాసియా దేశాలకు చెందిన దేశాధినేతలను ఒకచోట చేర్చుతుంది. ఒకప్పుడు ఆరు యురేషియా దేశాల కూటమిగా ఉన్న ఎస్సీఓ ఇప్పుడు 10 శాశ్వత సభ్యులు, 16 సంభాషణ లేదా పరిశీలక దేశాలను కలిగి ఉంది, భద్రత , ఉగ్రవాద వ్యతిరేకతను దాటి ఆర్థిక, వ్యూహాత్మక ,సైనిక సహకారాన్ని కవర్ చేయడానికి దాని ఎజెండాను విస్తరించింది. రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో మోడీ చివరిసారిగా జిన్‌పింగ్ -పుతిన్‌లతో వేదికను పంచుకున్నారు, అక్కడ ఉక్రెయిన్ వివాదం కారణంగా పాశ్చాత్య నాయకులు రష్యా అధ్యక్షుడి నుంచి దూరంగా ఉన్నారు. ఇప్పుడు టియాంజిన్ సమావేశానికికి పుతినా రాక భారతదేశం తన ప్రాంతీయ, ప్రపంచ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేటప్పుడు బీజింగ్- వాషింగ్టన్ రెండింటితో సంక్లిష్ట సంబంధాలను నావిగేట్ చేస్తూ దౌత్య సమతుల్యతను కొనసాగించడానికి చేస్తున్న ప్రయత్నాన్ని నొక్కి చెబుతుంది.

## ఉప్పునిప్పులా ఉండే లీడర్లు ఎదురుపడితే.?

ద్వారా రక్షించారు. ఆ తర్వాత వారు వెళ్లిపోయే ముందు ఎదురెదురుగా వచ్చారు. ఇద్దరూ కలవరేమో కానీ అనుకున్నారు. కానీ కారుకు అటు వైపు వెళ్తున్న కేటీఆర్ ఇటు వైపున ఉన్న బండి సంజయ్ ను ప్రత్యేకంగా వచ్చి కలశారు. కరచాలనం చేశారు. ఇద్దరూ కొన్ని మాటలు మాట్లాడుకున్నారు. బాగా కష్టపడుతున్నారని బండి సంజయ్ ను కేటీఆర్ ప్రశంసించినట్లుగా తెలుస్తోంది. మామ్నులుగా అయితే కేటీఆర్ ప్రస్తావన వస్తేనే బండి సంజయ్ మండిపడతారు. తన తండ్రిని అడ్డం పెట్టుకుని రాజకీయాల్లోకి వచ్చారని కేటీఆర్ కు తన స్థాయి లేదని అంటారు. బండి సంజయ్ ను కూడా కేటీఆర్ ఎద్దేవా చేస్తారు. ఆయన కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రిగా ఉన్నా ఏమీ తెలియదంటారు. వీరిద్దరి మధ్య రాజకీయ శత్రుత్వం అలాంటిది. కానీ అదంతా రాజకీయమేనని తాజా కరచాలనంతో నిరూపించారు. రాజకీయాలు గతంలోలా రాజకీయాల్లానే చూసేవారు. వ్యక్తిగతంగా వెళ్లేవారు కాదు. కానీ కొంత కాలంగా రాజకీయ ప్రత్యర్థుల్ని వ్యక్తిగత శత్రువులు చూసేలా రాజకీయాలు మారాయి. అందుకే వీరి షేక్ హ్యాండ్ వైరల్ అయింది. రాజకీయంగా ఎలా తిట్టుకున్నా వ్యక్తిగతంగా ఇలా ఉండటం మంచిదన్న అభిప్రాయం సోషల్ మీడియాలో వ్యక్తమవుతోంది.

## మోదీ కూడా ఓట్ల దొంగతనానికి పాల్పడ్డారు

బిహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, 'ఓట్ చోర్- గద్దీ ఛోడ్' అనే నినాదంతో ఆయన చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా ఈరోజు సీతామఢీలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా నుంచి సుమారు 65 లక్షల మంది పేర్లను అక్రమంగా తొలగించారని, ఇది ఓట్ల దొంగతనం కిందకే వస్తుందని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి ఓట్లను దొంగిలిస్తున్నాయి. గతంలో మహారాష్ట్ర, హరియాణా, కర్ణాటకలోనూ ఇదే విధంగా చేశారు. ఇప్పుడు బిహార్ వంతు వచ్చింది. కానీ, బిహార్ ప్రజలు తమ ఓట్లను దొంగిలించడానికి అంగీకరించరు" అని హెచ్చరించారు. తొలగించిన ఓట్లలో ఎక్కువ శాతం బడుగు, బలహీన వర్గాలకు చెందినవేనని ఆయన ఆరోపించారు. ఓట్ల చోరీకి సంబంధించి రాబోయే రోజుల్లో మరిన్ని ఆధారాలు బయటపెడతానని రాహుల్ స్పష్టం చేశారు.కొంతమంది పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చేందుకే బీజేపీ ప్రజల ఓటు హక్కును కాలరాస్తోందని ఆయన విమర్శించారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కూడా దొంగిలించిన ఓట్లతోనే ఏర్పడిందని, ప్రధాని సైతం ఓట్ల తస్కరణకు పాల్పడ్డారని సంచలన ఆరోపణలు చేశారు. యాత్రలో భాగంగా రాహుల్ గాంధీ స్థానిక సీతాదేవి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 17న ప్రారంభమైన 'ఓటర్ అధికార్ యాత్ర' 16 రోజుల పాటు 1300 కిలోమీటర్ల మేర కొనసాగనుంది. వచ్చే నెల 1న పట్నాలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభతో ఈ యాత్ర ముగియనుంది.

## పథకాల కోసం కుటుంబాలు విడిపోకూడదు

పొందుపర్చాలని అధికారులను ఆదేశించారు.

### పథకాలకోసం కుటుంబాలు విడిపోయే పరిస్థితి రాకూడదు

ఫ్యామిలీ కార్డు ద్వారా కుటుంబ అవసరాలను క్షేత్రస్థాయిలో సేకరించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు అధికారుల్ని సూచించారు. ప్రభుత్వ పథకాల కోసం కుటుంబాలు విడిపోయే పరిస్థితి రాకూడదన్నారు. అందరికీ లబ్ధి చేకూరేలా పథకాలను పునర్వ్యవస్థీకరణ చేయాలని సూచించారు. ఈ కార్డులోని వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడం ద్వారా పారదర్శకతను నిర్ధారించాలని ఆదేశించారు. త్వరలో రాష్ట్రంలో జనాభా విధానం తీసుకురావాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఈ విధానం ద్వారా కుటుంబ సంక్షేమం, సామాజిక అవసరాలను సమతుల్యం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. "క్షేత్రస్థాయి సమాచారం ఆధారంగా సంక్షేమ పథకాలు అమలు చేయాలి. ఇది ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించడంలో దోహదపడుతుంది," అని ఆయన వివరించారు. ఈ ఫ్యామిలీ కార్డు వ్యవస్థ రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలును మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా చేయడానికి ఒక ముందడుగుగా భావిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల అవసరాలను గుర్తించి, ప్రభుత్వ సేవలను వారి ఇంటి వద్దకే చేర్చే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. ఈ కొత్త విధానం రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆశిస్తోంది. ఒకే కుటుంబానికి పథకం వర్తింప చేయడం వల్ల అదే కుటుంబంలో ఉన్న పెళ్లిళ్లు అయిన కుమార్తెలు, కుమారులకు అన్యాయం జరుగుతోంది.

## ఏ ఒక్క దివ్యాంగునికీ అన్యాయం జరగదు

చంద్రబాబు చెప్పారు.'అబద్ధాల పునాదుల మీదే వైసీపీ రాజకీయం చేస్తుంది. ఆ పార్టీనే తప్పులు చేస్తుంది, వాటిని ఎదుటివారిపై నెడుతుంది. దీన్ని మనం సమర్థవంతంగా తిప్పికొట్టాలి. దేశంలో మరే ఇతర రాష్ట్రంలోనైనా గతంలోని ఏ ప్రభుత్వాలైనా ఈ స్థాయిలో పెన్షన్లు ఇచ్చాయా.? ఇవ్వడానికి ఆ ప్రభుత్వాలకు మనస్సు వచ్చిందా.? గత ప్రభుత్వం చాలా మంది అనర్హులకు పెన్షన్లు ఇచ్చింది. దీని వల్ల అర్హులకు నష్టం కలుగుతోంది. ఏ ఒక్క అర్హుడికి నష్టం కలగకూడదంటే అనర్హులను తప్పించాలి. అనర్హులను గుర్తించే ప్రక్రియలో ఎక్కడైనా లోపాలున్నా అధికార యంత్రాంగం పొరపాట్లు చేసినా దాన్ని గుర్తించి సరిదిద్దే బాధ్యతను పార్టీ యంత్రాంగం తీసుకోవాలి. సీఎంగా ప్రభుత్వ విధానాలను అమలు చేస్తాను, ఏమైనా తేడాలుంటే పార్టీ అధినేతగా పార్టీ యంత్రాంగం ఇచ్చే ఫీడ్ బ్యాక్ తీసుకుంటాను. ఆ లోపాలను సరిదిద్దుతాను. అర్హుడైన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తాం. పింఛన్ అందిస్తాం. తాత్కాలిక సర్టిఫికెట్లు ఉన్న వారికి నోటీసులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ పెన్షన్ ఇవ్వాలని ఆదేశించాం. ప్రతి ఇంటికీ మనం చేసే మంచి పని చేరాలి. ప్రభుత్వం మంచి చేస్తోంది, ఇబ్బందులున్నా సంక్షేమం అందిస్తుందనే విషయం ప్రజలు అర్థం చేసుకునేలా వివరించాలి." అని సీఎం సూచించారు.

### ప్రజల కోసం రాజకీయం చేయాలి.. శాశ్వతంగా నిలవాలి

"కార్యకర్తలు, నేతలు గట్టిగా పని చేసి పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో మన అభ్యర్థులను గెలిపించారు. ఏ ఎన్నిక వచ్చినా కూటమే గెలవాలి. మనం ఏ చిన్న తప్పు చేసినా భూతద్దంలో చూపించి దెబ్బతీయాలని ప్రత్యర్థులు చూస్తున్నారు. వారి కుట్రల పట్ల జాగ్రత్తగా ఉండాలి. కొందరు తాత్కాలిక రాజకీయాలు చేయాలనుకుంటారు దీని వల్ల ఇబ్బందులు వస్తాయి. శాశ్వత రాజకీయాలు చేయాలి, అప్పుడు మనం రాణించగలం. జిల్లా కమిటీల ఎంపిక ప్రక్రియ దాదాపు పూర్తైంది. త్వరలో ప్రకటిస్తాం. రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేస్తాం. పని చేసే నాయకత్వానికి పెద్దపీట వేస్తాం. కార్యకర్తల్లో మరిన్ని నాయకత్వ లక్షణాలు పెంచుతాం. ఆర్థికంగా బలోపేతం చేస్తాం." అని చంద్రబాబు వెల్లడించారు.

## తెలంగాణ క్రీడాపాలసీలో సమూలమైన మార్పు

### తెలంగాణలో క్రీడా సంస్కృతి రావాలి

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా విధానం, క్రీడల ప్రోత్సాహం విషయంలో ప్రతి ఒక్కరూ హైదరాబాద్ గురించి మాట్లాడుకోవాలనేదే తన లక్ష్యమని సీఎం రేవంత్ అన్నారు. క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ వేదికగా మారాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. తెలంగాణకు ఐటీ సంస్కృతి ఉందని రాష్ట్రంలోని ప్రతి కుటుంబం తమ పిల్లలు ఐటీ రంగంలో ఉండాలని కోరుకుంటున్నారని అలానే క్రీడా సంస్కృతి రావాలని తాను అభిలషిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. క్రీడా రంగం ప్రోత్సాహానికిగానూ గతంతో పోల్చితే 16 రెట్లు బడ్జెట్ పెంచామని సీఎం వివరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని సీఎం తెలిపారు. క్రీడా రంగం ప్రాధాన్యతను పెంచేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా పెద్ద ఎత్తున స్టేడియాలు, అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు లేవని, వాటిని సమగ్రంగా సద్వినియోగం చేసుకోవడంతో పాటు క్రీడా రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు బోర్డు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం కోరారు. క్రీడా రంగం అభివృద్ధికి నిధులు, నిపుణులు, నిర్వహణ అవసరమైనందునే బోర్డులో ప్రముఖ కార్పొరేట్లు, క్రీడాకారులు, క్రీడా నిర్వాహకులకు చోటు కల్పించామని సీఎం తెలిపారు.

### ప్రతి విద్యార్థి ఏదో ఓ క్రీడలో పాల్గొనేలా ప్రోత్సహించాలి

ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో పాల్గొనేలా చూస్తే ఫలితాలు వాటంతటవే వస్తాయని మాజీ క్రికెటర్ కపిల్ దేవ్ అభిప్రాయపడ్డారు. హర్యానాలో కుస్తీతో ప్రతి క్రీడకు పల్లెల్లో చోటు ఉందని ఆయన గుర్తు చేశారు. ప్రతి పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు, వ్యాయామ సంచాలకుడు ఉండేలా చూడాలని అభినవ్ భింద్రా సూచించారు. పాఠశాల స్థాయిలోనే క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని వ్యాయామ అక్షరాస్యతపై అవగాహన పెంపొందించాల్సి ఉందని ధాని ఫౌండేషన్ వీతా ధానీ సలహా ఇచ్చారు. గ్రామ స్థాయి నుంచి క్రీడా పోటీలు దశలవారీగా ఉండాలని అప్పుడు మెరుగైన క్రీడాకారుల ఎంపిక సాధ్యమవుతుందని గోపీచంద్ సలహా ఇచ్చారు. ఫిజియోథెరపిస్టు కోర్సులను క్రీడా యూనివర్సిటీలో ప్రారంభించాలని హబ్ కో ఛైర్‌పర్సన్ ఉపాసన కొణిదెల సూచించారు. గ్రామ స్థాయిలో స్టేడియాలు, క్రీడా సామగ్రి అందుబాటులో ఉండే క్రీడాకారులు వెలుగులోకి వస్తారని తెలిపారు. ఇంగ్లాండ్‌లో ప్రతి ఆటకు లీగ్స్ ఉంటాయని అలాగే మన దగ్గర ప్రతి ఆటకు లీగ్స్ ఉండాలని ఫుట్ బాల్ టీమ్ మాజీ కెప్టెన్ బైచుంగ్ భూటియా సూచించారు.

### సభ్యుల సూచనల మేరకు మార్పులు

క్రీడా పోటీల విధానాన్ని మార్చుతూ గ్రామ, మండల, శాసనసభ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తామని సీఎం తెలిపారు. శాసనసభ నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్ల మధ్య పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించి అంతిమంగా రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయి జట్లను ఎంపిక చేస్తామన్నారు క్రీడా సామగ్రిపై ఉన్న పన్నుల తగ్గింపునకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతామని తమ స్థాయిలో అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ఫిజియోథెరపీ, ఇతర క్రీడా సంబంధిత కోర్సులు ప్రవేశపెడతామని బోర్డు సభ్యులకు తెలియజేశారు. స్టేడియాలు పెద్ద సంఖ్యలో ఉన్నా తగిన సంఖ్యలో కోచ్‌లు లేరని, ఉన్న కోచ్‌లకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు తగినట్లు శిక్షణ ఇప్పించాల్సి ఉందన్నారు.

## హైదరాబాద్ వాసులకు చిల్లింగ్ న్యూస్

సెటైర్లు కాదు నిజంగానే బీచ్ ను తెస్తున్నారు. కాకపోతే కృత్రిమ బీచ్.హైదరాబాద్‌లో మొట్టమొదటి అర్టిఫిషియల్ బీచ్ ఈ ఏడాది డిసెంబర్‌లో కొత్వాల్ గూడ వద్ద ప్రారంభం కానుంది. రూ.225 కోట్ల బడ్జెట్‌తో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంలో నిర్మితమవుతున్న ఈ ప్రాజెక్ట్, సముద్ర తీర అనుభవాన్ని అందించే మానవ నిర్మిత సరస్సు. ఇక్కడ అడ్వెంచర్ స్పోర్ట్స్, ఫ్లోటింగ్ విల్లాస్, వేవ్ పూల్స్ వంటి సౌకర్యాలతో నగరవాసులకు వారాంతపు వినోదాన్ని అందించనుంది. సుమారు 35 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న ఈ అర్టిఫిషియల్ బీచ్, సముద్ర తీరాన్ని పోలిన అనుభవాన్ని అందించేలా ఉంటుంది. ఈ ప్రాజెక్ట్ డీపీఆర్ ఇప్పటికే సిద్ధమైంది. అంతర్జాతీయ పెట్టుబడిదారులు ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి చూపుతున్నారు. తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్‌టీడీసీ) ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఈ ప్రాజెక్ట్‌ను రాష్ట్ర టూరిజం రంగంలో కీలకమైన అడుగుగా చెబుతున్నారు.ఈ అర్టిఫిషియల్ బీచ్ కేవలం ఇసుక , నీటితో మాత్రమే పరిమితం కాదు. ఇందులో ఫ్లోటింగ్ విల్లాస్, స్టార్-కేటగిరీ హెూటళ్లు, వేవ్ పూల్స్, ఫుడ్ కోర్టులు, థియేట్రికల్ వేదికలు, డెకరేటివ్ ఫౌంటైన్స్, పార్కులు, సైక్లింగ్ ట్రాక్‌లు, స్కేటింగ్, బంజీ జంపింగ్, సెయిలింగ్, సిమ్యులేటెడ్ వింటర్ స్పోర్ట్స్ వంటి సౌకర్యాలు ఉంటాయి. ఈ సౌకర్యాలు కుటుంబాలకు ఒక రోజంతా ఆనందించే అనుభవాన్ని అందించేలా సిద్ధం చేస్తారు. తెలంగాణలో టూరిజం రూ. 15,000 కోట్ల స్థాయిలో ఉంది. ఈ అర్టిఫిషియల్ బీచ్ ప్రాజెక్ట్ హైదరాబాద్‌ను గ్లోబల్ టూరిజం మ్యాప్‌లో ఒక ఆకర్షణీయ గమ్యస్థానంగా మార్చడానికి లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ నగరవాసులకు నగరం వెలుపల ప్రయాణం చేయకుండానే వారాంత వినోదాన్ని అందించడంతో పాటు, హైదరాబాద్‌ను ఒక డైనమిక్ అర్బన్ రిట్రీట్‌గా రూపొందించనుంది.కొట్వాల్ గూడ, ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో ఉండటం వల్ల అద్భుతమైన కనెక్టివిటీ, విస్తరణ సామర్థ్యాన్ని కలిగి ఉంది. నిర్మాణ సమయంలో పర్యావరణ రక్షణ చర్యలను అమలు చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ, స్థిరమైన అభివృద్ధిని నిర్ధారించేలా ఈ ప్రాజెక్ట్ ను నిర్మిస్తారు. ఈ ప్రాజెక్ట్ విజయవంతంగా అమలైతే, హైదరాబాద్‌ను ఒక ల్యాండ్‌లాక్ నగరం నుండి ఒక ఆకర్షణీయమైన టూరిజం హబ్‌గా మార్చే అవకాశం ఉంది.

## 75 ఏళ్లకు తప్పుకోమని నేను ఎవరికీ చెప్పలే

భగవత్ చేసిన వ్యాఖ్యలు ఆయనను ఉద్దేశించినవేనని జరుగుతున్న ప్రచారానికి ఈ ప్రకటనతో తెరపడింది. గురువారం ఢిల్లీలో జరిగిన "100 వర్ష్ కీ సంఘ్ యాత్ర" కార్యక్రమంలో భగవత్ మాట్లాడుతూ, "నేను రిటైర్ అవుతానని గానీ, ఇంకెవరైనా రిటైర్ అవ్వాలని గానీ ఎప్పుడూ చెప్పలేదు" అని స్పష్టం చేశారు. గతంలో తాను ఆర్ఎస్ఎస్ మాజీ నేత మోరోపంత్ పింగళికి సంబంధించిన ఒక చమత్కారమైన సంఘటనను ఉదాహరించానని, దానిని చాలామంది తప్పుగా అన్వయించుకున్నారని వివరించారు.

నాగ్‌పూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పింగళి జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ సందర్భంగా ఆయనకు సంబంధించిన మూడు, నాలుగు సరదా సంఘటనలను పంచుకున్నానని గుర్తుచేశారు."మోరోపంత్ చాలా చమత్కారి. ఆయన మాటలతో కుర్చీలోంచి ఎగిరి గంతేసేలా చేసేవారు," అని భగవత్ అన్నారు. పింగళికి 75 ఏళ్లు వచ్చినప్పుడు, మరో సీనియర్ నేత హెచ్.వి. శేషాద్రి ఆయనకు శాలువా కప్పి ఇక బాధ్యతల నుంచి తప్పుకోవాలని సున్నితంగా సూచించిన సంఘటనను తాను సరదాగా చెప్పానని, అంతేకానీ దానిని ఒక నిబంధనగా పరిగణించరాదని ఆయన తెలిపారు. సంఘ్ కార్య పద్ధతిని వివరిస్తూ, "సంఘ్‌లో మేమంతా స్వయంసేవకులం. మాకు ఇష్టం ఉన్నా లేకపోయినా ఒక పని అప్పగిస్తారు. నాకు 80 ఏళ్లు వచ్చినా సరే, శాఖను నడపమంటే నడపాల్సిందే. మాకు ఏది చెప్పారో అది చేస్తాం" అని ఆయన అన్నారు. ప్రస్తుతం తాను సర్ సంఘ్‌చాలక్‌గా ఏకైక వ్యక్తిని అయినప్పటికీ, తన తర్వాత ఆ బాధ్యతలు చేపట్టేందుకు కనీసం 10 మంది సిద్ధంగా ఉన్నారని భగవత్ పేర్కొన్నారు. "సంఘ్ మమ్మల్ని ఎంతకాలం పనిచేయమంటే అంతకాలం పనిచేయడానికి మేము సిద్ధంగా ఉన్నాం" అని ఆయన పునరుద్ఘాటించారు.

## ఆర్టికల్ 200 ఏం చెబుతోంది.?

సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే, కేంద్రం మాత్రం రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లుల విషయంలో రాష్ట్రపతి లేదా గవర్నర్ చర్యలపై మౌలిక హక్కుల ఉల్లంఘన పేరుతో నేరుగా సుప్రీంకోర్టు రిట్ జూరిస్డిక్షన్ (ఆర్టికల్ 32) వినియోగించలేవని కేంద్రం వాదించింది. అయితే, బిల్లుల ఆమోదంపై రాజ్యాంగ రూపకర్తలు ఆర్టికల్ 200లో తొలుత ఉన్న 6 వారాల గడువును తొలగించి, దాని స్థానంలో 'వీలైనంత త్వరగా' అన్న పదాన్ని చేర్చారని ధర్మాసనం పేర్కొంది. దీన్ని విస్మరించి బిల్లులను గవర్నర్లు నిరవధికంగా వాయిదా వేస్తూ కూర్చుంటారా? అనేది ప్రధాన అంశంగా మారింది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం బిల్లుకు సమ్మతి తెలపడం, సమ్మతి నిరాకరించడం, పునః పరిశీలించమని అసెంబ్లీకి పంపడం (ద్రవ్య బిల్లులు మినహా), రాష్ట్రపతి పరిశీలనకు పంపడం అనే నాలుగు అవకాశాలు గవర్నర్‌కి అవకాశాలుంటాయి, అదే సమయంలో అసెంబ్లీ మళ్లీ పరిశీలించి బిల్లును తిరిగి పంపితే, గవర్నర్ ఇక సమ్మతి నిరాకరించలేరు. 'అసెంబ్లీ ఆమోదించిన బిల్లుకు సమ్మతి తెలిపే అంశంలో మొదట ఆరు వారాల గడువు, తర్వాత 'వీలైనంత త్వరగా'గా మార్చారు. రాజ్యాంగ రూపకర్తలు దీన్ని 'తక్షణమే' అని భావించారు. అప్పుడు దీన్ని మనం పక్కన పెట్టగలమా?' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు.ఈ కేసులో తమిళనాడు తరఫున వాదనలు వినిపించి సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి గవర్నర్లు ద్రవ్య బిల్లులకూ సమ్మతి నిరాకరించడం అంటే వారిని వారు 'సూపర్ సీఎంలా' భావిస్తున్నట్టు లెక్క శాసనసభ ఆమోదించిన బిల్లుకు సమ్మతి ఇవ్వకుండా నిరవధికంగా వాయిదా వేయడం ఆర్టికల్ 200ని అపహాస్యం చేయడమే' అని అన్నారు. నిరవధికంగా సమ్మతి నిరాకరిస్తే 'వీలైనంత త్వరగా' అనే పదబంధం అర్థం కోల్పోతుందని వ్యాఖ్యానించారు. గవర్నర్ లేదా రాష్ట్రపతి 'నామమాత్రపు ప్రభుత్వ పెద్ద' మాత్రమేనని, వారికి విస్తృత స్వతంత్ర వివేచన అధికారం లేదనేది రాజ్యాంగ రూపకర్తల ఉద్దేశం అని సింఘ్వీ అభిప్రాయపడ్డారు. ఆర్టికల్ 200లోని మూడు మార్గాల్లోనూ మంత్రివర్గ సలహాను గవర్నర్లు అనుసరించాల్సిందేనని, గవర్నర్‌కి "నాల్గో ఎంపిక" (అంటే బిల్లును నిరవధికంగా ఆమోదించకపోవడం) లేదని చెప్పారు.

## ధర్మ జాగరణ సమితి ప్రచారక్ లింగం అకాల మరణం

అచ్చంపేట, : ధర్మ జాగరణ సమితి ప్రచారక్ ఓరుగంటి లింగం అకాల మరణం పట్ల వంగూర్ మండల కేంద్రంలో హిందూ కార్యకర్తలు గురువారం ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. లింగం సేవలు మరవలేనివని, చిన్న వయసులోనే ఆయన మరణించడం బాధాకరమని కార్యకర్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, దేవేందర్, బాలు, వెంకటేష్, వెంకటస్వామి, చక్రవర్తి, మహేష్, వేణు, రాఘవేందర్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య

కోదాడ, : కోదాడ మండలం రెడ్ల కుంట గ్రామంలో చింతన గండ్ల రాజేష్ అనే యువకుడు రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బయటి నుంచి ఇంటికి వచ్చిన రాజేష్‌ను అతని అమ్మమ్మ గుర్తించి కేకలు వేయడంతో, చుట్టుపక్కల వారు వచ్చి అతన్ని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతుడు రామాపురం క్రాస్ రోడ్ వద్ద ఒక ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో పూరిల్లు దగ్ధం

సూర్యాపేట, : నడిగూడెం మండలం రామాపురం గ్రామంలో వారణాసి సింహాద్రికి చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో బీరువాలో ఉన్న రెండు తులాల బంగారం, వెండి పట్టీలు, 75 వేల నగదు, వంట సామాను, వస్త్రాలు కాలిపోయాయి. సుమారు ఐదు లక్షల రూపాయలకు పైగా నష్టం జరిగిందని బాధితుడు వారణాసి సింహాద్రి, కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

## ఎంబిబిఎస్ పీజీ సీటు..
## ఎమ్మెల్యే అభినందనలు

తుంగతుర్తి,: సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మాచినపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మంద భాస్కర్ కుమార్తె ఉమారాణికి ఎంబిబిఎస్ పీజీ సీటు రావడంతో, ఎమ్మెల్యే మందుల సామేలు రూ. 25వేల ఆర్థిక సహాయం అందించి అభినందించారు. ఉన్నత చదువులు చదివి ఎంబిబిఎస్ పీజీ సీటు సాధించడం తల్లిదండ్రులకు, గురువులకు సంతోషాన్ని కలిగిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రదర్శన

హుజూర్‌నగర్, : నడిగూడెం మండల కేంద్రం శ్రీరంగాపురం గ్రామంలో గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల కోసం వార్డుల వారీగా ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. ఏవైనా సవరణలు ఉంటే 30-8-2025 లోపు తెలియజేయాలని స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రత్యూష తెలిపారు. ఈ ప్రక్రియ కోదాడ నియోజకవర్గ పరిధిలోని నడిగూడెం మండలంలో జరుగుతోంది.

## గాంధారిలో పొంగినవాగు వరదలో
## చిక్కిన వారిని కాపాడిన పోలీసులు

ఎల్లారెడ్డి, : గాంధారి మండలంలో గాంధారి- కామారెడ్డిలో బ్రిడ్జి, స్థానిక గ్రామం డేంజర్ జోన్ లో ఉన్నాయని అధికారులు తెలిపారు. గురువారం వాగు పొంగడంతో గంగమ్మ గుడి నీట మునిగింది. ఈ క్రమంలో వాగులో చిక్కుకున్న మహిళను స్థానికుల సమాచారంతో పోలీసులు కాపాడారు. వాగు పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, ఇళ్లలోకి నీరు వచ్చే ప్రమాదం ఉందని పోలీసులు హెచ్చరించారు.

## పోచారం ప్రాజెక్టు ప్రధాన పెద్ద వంతెనకు
## గండి రాకపోకలు బంద్

కామారెడ్డి, : పోచారం ప్రాజెక్టు పొంగిప్రవహిస్తున్న నేపథ్యంలో ఆ వరద మంజీరనదిలోకి వెళ్లే ఎల్లారెడ్డి - హైదరాబాద్ జాతీయ రహదారిలోని పోచారం పెద్ద వంతెనకు గండి పడింది. వరద నీరు వంతెనపై నుండి పారడంతో ఈ గండి పడింది. దీంతో ఎల్లారెడ్డి - మెదక్ -నర్సాపూర్ - హైదరాబాద్ రహదారి మూతపడింది. ప్రతీ రోజు వేల సంఖ్యలో తిరిగే జాతీయ రహదారిలో ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతం. ప్రయాణికులు ఎవ్వరు ఈ దారుల వెంట రావద్దని అధికారులు హెచరిస్తున్నారు.

## పిట్లంలో రెండు రోజులుగా
## కురుస్తున్న వర్షానికి కూలిన ఇల్లు

జుక్కల్ , : కామారెడ్డి జిల్లా పిట్లంలోని నేతాజీ నగర్ కాలనీలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి ఒక ఇల్లు కూలిపోయింది. ఈ సంఘటనపై సమాచారం అందుకున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి బలరాం సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఇళ్లలోకి నీరు చొరబడుతుండటంతో, గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి మట్టిని తొలగించే పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారులతో ఫోన్లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సమీక్ష

బాన్సువాడ, : ఎల్లారెడ్డి సెగ్మెంట్ లో భారీ వర్షాల కారణంగా ఏర్పడిన విద్యుత్ సమస్యను పరిష్కరించడానికి, ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు గురువారం జిల్లా విద్యుత్ అధికారి (ఎస్ఈ)తో ఫోన్ లో సమీక్ష నిర్వహించారు. విద్యుత్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎస్ఈ స్పందించి, విద్యుత్ పునరుద్ధరణ కోసం అత్యధిక బృందాలను రంగంలోకి దింపి తక్షణ చర్యలు చేపట్టారు.

### వాగుతో మళ్ళీ మొదలైన కష్టాలు

షాద్‌నగర్, : షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం అయ్యవారిపల్లి గ్రామ వాగులో వర్షాలు వచ్చినప్పుడు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత మూడు నెలల్లో కనీసం నాలుగు సార్లు వాగు ప్రవహించి, ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తోంది. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా గురువారం వాగు ఉధృతంగా ప్రవహించడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

## నడవలేక నడి వాగులోకి నాగయ్య

# చెట్టు పట్టుకున్నా క్షణాల్లో గల్లంతు



గంభీరావుపేట(ప్రశ్న న్యూస్) తోటి పశువుల కాపరులతో అప్పటి వరకు కలిసొచ్చిన తోటి కాపరి నరాల సంబంధిత సమస్య కారణంగా వేగంగా నడవలేక మానేరు వాగులో గల్లంతైన ఘటన గంభీరావుపేట మండల నర్మాలలో విషాదాన్ని నింపింది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం నర్మాలకు చెందిన పంపుకాడి నాగయ్య గత నాలుగేండ్ల క్రితం జరిగిన ఓ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. దీంతో నరాల సంబంధిత సమస్య కారణంగా ఓ కాలు, చేతు సరిగా పని చేయడం లేదు. వేగంగా నడవడం, బలమైన పనులు చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం నర్మాలకు చెందిన పంపుకాడి నాగయ్యతో పాటు నర్సింలు, జంగం స్వామి, ద్యానబోయిన స్వామి, పిట్ల మహేశ్, పిట్ల స్వామి పాడి గేదెలను మేతకు తీసుకుని ఎగువ మానేరు మత్తడి సమీపంలోని మాచారెడ్డి–సిద్దిపేట కాజ్వే రోడ్డుపై నుంచి ఆవట గట్టుపైకి వెల్లారు. ఉదయం 10గంటలకు వెల్లిన వారి నుంచి అదే గ్రామానికి చెందిన నర్సింలు పంపుకాడి నాగయ్య ఇద్దరు తమ గేదెలను తీసుకుని 11.30 గంటలకు తిరిగి ఇంటికి బయలు దేరారు. నర్సింలు గేదెలను తీసుకుని కాజ్వే దాటుతుండగానే మానేరు మత్తడి నుంచి ప్రవాహం పెరుగుతుండగా పరుగుపరుగున నర్సింలు కాజ్వేను దాటాడు. నాగయ్య వెనక కూడా మరో ఇద్దరు పశువుల కాపరులు వస్తున్నారు. వారు కాజ్వే నుంచి వెలుతుండగా అప్పటికే నాగయ్య మద్యలోకి చేరుకున్నాడు. అదే సమయంలో నీటి ఉధృతి పెరగడం గమనించిన నాగయ్య వెనకున్న పశువుల కాపరులు పరుగుపరుగున వెనక్కి వెల్లిపోయారు. నరాల సంబంధిత సమస్య కారణంగా త్వరగా నడవలేక నాగయ్య వడివడిగా ముందుకు వెల్లలేక, వెనక్కి వెల్లలేక అందులో చిక్కుకుపోయి ఓ రాతి కనీని పట్టుకున్నాడు. అతని ముందున్న నర్సింలు వెనక్కి తిరిగి నాగయ్య వైపు చూసే సరికి ప్రవాహంలో కొట్టుకుపోయి ఓ చెట్టువద్దకు చేరాడు. అక్కడున్న వారు ఇంటికి సమాచారమిచ్చి వచ్చేలోపు ప్రవాహ వేగానికి నీల్లలో గల్లంతయ్యాడు. కళ్లముందే నాగయ్య ప్రవాహంలో గల్లంతవ్వడంతో గురువారం సైతం ఎంత వెదికినా ఆచూకీ లభించలేదు. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనలో ఉన్నారు.

# ఎగువ మానేరు ప్రాజెక్టు వద్ద చిక్కుకుపోయిన ఏడుగురు క్షేమం

**కలెక్టర్, ఎస్పీ గ్రేట్ ఆఫీసర్స్**
**కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్**
**కేంద్ర హెూం శాఖ సహయ మంత్రి బండి సంజయ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పర్యవేక్షణ**
**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే, అధికార యంత్రాంగం ముమ్మర చర్యలు**

సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) ఎగువ మానేరు ప్రాజెక్టు వద్ద చిక్కుకుపోయిన ఏడుగురు క్షేమంగా బయటపడ్డారు.
గంభీరావుపేట మండలం నర్మాల వద్ద ఎగువ మానేరు ప్రాజెక్టు వద్ద చిక్కుకున్న వారిని దగ్గరుండి పర్యవేక్షించి. క్షేమంగా తరలించారు. ప్రాజెక్టు వద్ద చిక్కుకుపోయిన వారిని క్షేమంగా ఇంటికి తరలించే వరకు విశేష సేవలు అందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే గ్రేట్ ఆఫీసర్స్ అని కొనియాడి, వారికి కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. నర్మాల వద్ద ఉన్న ఎగువ మానేరు ప్రాజెక్టు అవతలి వైపు పశువులను మేపేందుకు వెళ్లిన రైతులు జంగం స్వామి, పిట్ల స్వామి, పిట్ల మహేష్, పిట్ల నర్సింలు, ధ్యానబోయిన స్వామి, మరో ఇద్దరు బిసే ప్రదీప్, బిసే ఛాయా అక్కడే చిక్కుకుపోగా, కలెక్టర్, ఎస్పీ సహాయక చర్యలను ముమ్మరం చేశారు. చిక్కుకున్న వారికి ఆహార సదుపాయం కల్పించారు. ఆర్మీ హెలికాప్టర్ల ద్వారాప్రాజెక్ట్ వద్ద చిక్కుకుపోయిన వారిని భారత వైమానిక దళం హాకీంపేటలోనే సైనిక హెలికాప్టర్లు చేరుకొని క్షేమంగా గమ్యం చేర్చారు.

### ఎప్పటికప్పుడు పర్యవేక్షణ

ప్రాజెక్టు వద్ద చిక్కుకుపోయిన వారి పరిస్థితి పై కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎప్పటికప్పుడు ఆరా తీశారు. వారికి సహాయం అందించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. గురువారం ఉదయమే ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేరుకొని క్షేమంగా చేరుకున్న వారిని పరామర్శించారు.

### క్షేమంగా ఇంటికి..

ప్రాజెక్ట్ వద్ద చిక్కుకుపోయి ఇబ్బంది పడుతున్నారనే విషయం తెలుసుకున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే అక్కడికి చేరుకున్నారు. బుధవారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి



2 గంటల వరకు అక్కడే ఉన్నారు. లింగన్నపేట లో వాగులో చిక్కుకుపోయిన ప్రవీణ్ ను క్షేమంగా ఒడ్డుకు చేర్చే వరకు కలెక్టర్, ఎస్పీ దగ్గరుండి పర్యవేక్షించి.. ఎన్డీఆర్ ఎఫ్ బృందానికి సలహాలు సూచనలు అందించారు. గురువారం ఉదయమే మళ్లీ ఎగువ మానేరు ప్రాజెక్ట్ వద్దకు కలెక్టర్, ఎస్పీ చేరుకొని పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనించారు. ప్రాజెక్టులో నీటి మట్టం, ఎగువ నుంచి ఎంత వస్తుందని ఆరా తీస్తూ.. ప్రాజెక్ట్ వద్ద చిక్కుకుపోయిన వారికి మనోధైర్యం కల్పించారు. ఏడుగురు క్షేమంగా గమ్యం చేరుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఘటన విషయం తెలిసి దగ్గరుండి అందరిని క్షేమంగా తరలించడంలో విశేష కృషి చేసిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే గ్రేట్ ఆఫీసర్స్ అని, వారికి అధికార యంత్రాంగాన్ని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రత్యేకంగా అభినందించారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రత్యేక

# చొరవతో బోరు ఏర్పాటు

- **ముమ్ముందు బండి సంజయ్ సహకారంతో అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు నిర్వహిస్తాం**
- **భాజపా అసెంబ్లీ కన్వీనర్ : పెరుక శ్రవణ్ కుమార్**
- **బండి సంజయ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన హిందూపూర్ గ్రామస్తులు**



గంగాధర (ప్రశ్న న్యూస్) గంగాధర మండలం, హిందూపూర్ (ఇస్లాంపూర్) గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయగా గురువారం హిందూపూర్ (ఇస్లాంపూర్) గ్రామంలో బోరు వేయడం జరిగింది.ఈ సమస్యను గంగాధర మండల బీజేపీ అధ్యక్షులు పంజాల ప్రశాంత్ బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి సహాయం అందించారు.గ్రామ ప్రజలు ఈ సందర్భంగా బండి సంజయ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా భాజపా చొప్పదండి అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్ మాట్లాడుతూ"గంగాధర మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తున్న బండి సంజయ్, హిందూపూర్ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించడంలో మాకు తోడ్పాటునిచ్చారు. భవిష్యత్తులో కూడా ప్రతి గ్రామానికి ఆయన సహకారంతో అభివృద్ధి పనులు చేస్తాం" అని పేర్కొన్నారు.కార్యక్రమంలో భాజపామండల అధ్యక్షుడు పంజాల ప్రశాంత్, మండల ప్రధాన కార్యదర్శి రేండ్ల శ్రీనివాస్, యువ మోర్చా మండల అధ్యక్షుడు దయ్యాల ప్రణయ్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు తాళ్ల రాజశేఖర్, దయ్యాల పరుశురాం, సుంకె రవి,తదితర గ్రామస్థులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారి సేవలో ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్,మంత్రి నారాయణ

- **భారతదేశం శక్తివంతంగా ఎదగాలి ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్**
- **కంచిమఠాన్ని సందర్శించిన రాధాకృష్ణన్,నారాయణ**
- **శేష వస్త్రంతో సత్కరించిన తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్**



తిరుమల(ప్రశ్న న్యూస్) ప్రపంచ దేశాలలో భారత్ శక్తివంతమైన దేశంగా ఎదగాలని తిరుమల శ్రీవారిని ప్రార్థించినట్లు ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్ తెలిపారు. తిరుమల శ్రీవారి నైవేద్య విరామ సమయంలో ఇండియా ఉపరాష్ట్రపతి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ తో పాటు..మంత్రి నారాయణ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బిఆర్ నాయుడు ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణను శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.. ఆధ్యాత్మికత ఒక్కటే ఉన్నతమైన మానవ జీవన విధానమని, ఆధ్యాత్మికం వలన స్వీయ నియంత్రణ, క్రమశిక్షణ సిద్ధిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.స్వామి అనుగ్రహంతో దేశప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు వెల్లడించారు..తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం తిరుపతిలోని కంచి మఠాన్ని సందర్శించారు. ఆయన వెంట మంత్రి నారాయణ, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ఉన్నారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామివారి అనుగ్రహం పొంది ఆశీస్సులను అందుకున్నారు.తిరుమల, తిరుపతి పర్యటన అనంతరం రేణిగుంట విమానాశ్రయం నుంచి మహారాష్ట్ర గవర్నర్ సీపీ. రాధాకృష్ణన్ తిరుగు ప్రయాణం అయ్యారు. ఆయనకు మంత్రి పి.నారాయణ, కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ వీడ్కోలు పలికారు. బొకేలు అందజేసి శాలువాతో సత్కరించారు. మంత్రితోపాటు బీజేపీ నాయకులు, తుడా ఛైర్మెన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ,టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డిలు ఉన్నారు.



## మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరం

# జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్త



మేడ్చల్( ప్రశ్న న్యూస్) మేజర్ ధ్యాన్ చంద్ హాకీ లెజెండ్ జయంతి ని పురస్కరించుకుని గురు వారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సముదాయం లోని ఉద్యోగులకు వాలీబాల్, రన్నింగ్, చెస్, టగ్ అఫ్ వార్, క్రికెట్, మ్యూజికల్ చైర్, క్యారం బోర్డు వంటి క్రీడా పోటీల ను నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా ఆధ్వర్యంలో జిల్లా యూత్ అడ్వాన్స్మెంట్ స్పోర్ట్స్ వారు ఈ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా మాట్లాడుతూ ఉద్యోగులకు క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహద పడుతాయన్నారు క్రీడా స్ఫూర్తిని ఉద్యోగంలో కూడా పాటిస్తే మెరుగైన సేవలు అందించగలరని తెలిపినారు.
అనంతరం, గెలుపొందిన వారికి జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, స్పోర్ట్స్ అధికారి జి.వి. గోపాల్ రావు, ఎ ఓ ఎల్ రామ్మోహన్ రావు కలెక్టరేట్ ప్రాంగణంలోని ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ లీగల్ కార్యదర్శిగా బి.పాపి రెడ్డి

**సంతోషం వ్యక్తం చేసిన వీర్లపల్లి రాజమల్లారెడ్డి, వీర్లపల్లి భాగ్యరెడ్డిలు**






మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మహబూబ్ నగర్ జిల్లా సెషన్స్ ప్రిన్సిపల్ జడ్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న బి. పాపిరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వానికి లీగల్ కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బి.పాపిరెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఒక సంవత్సరం పాటు డిప్యూటేషన్ పై బాధ్యతలు నిర్వహించనున్నారు.

**పాపిరెడ్డి డబిల్ పూర్ వాసి**

ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని డబిల్ పూర్ గ్రామానికి చెందిన బి. పాపి రెడ్డి ఉన్నత చదువులు చదివి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రభుత్వ లీగల్ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించడం గొప్ప విషయమని గ్రామానికి చెందిన వీర్లపల్లి రజితరాజమల్లారెడ్డి, వీర్లపల్లి గీతభాగ్యరెడ్డితో పాటు గ్రామ, మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లీగల్ కార్యదర్శిగా పాపిరెడ్డి నియామకం కావడం గ్రామానికే గర్వకారణమని వారు పేర్కొన్నారు.

## వినాయక నవరాత్రులు ఉత్సవాలు ప్రారంభం




సుల్తాన్ బజార్(ప్రశ్న న్యూస్)సుల్తాన్ బజార్ పరిధిలోని కృపారాంబాగ్ లో వీనస్ అసోసియేషన్ ఆద్వర్యంలో వినాయక నవరాత్రుల ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా ప్రారంభించబడిన్నాయని శాంత్ కుమార్ సావంత్ తెలిపారు. వినాయక చవితి సందర్భంగా ప్రత్యేకం ఏర్పాటు చేసిన మండపంలో ప్రతిష్టించిన కుర్మాంపై (తాబేలు) ఉన్న వినాయకునికి ఘనంగా పూజలను నిర్వహించారు. గత 49 సంవత్సరాల నుండి వీనస్ అసోసియేషన్ ఆద్వర్యంలో గణేష్ నవరాత్రుల పూజలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. వినాయక విగ్రహహన్ని చేసేది మట్టితో, అలంకరించేది పూలతో, పూజించేది ఆకులతో, (పత్రి) నిమ్మజ్జనం చేసేది నీటిలో, గణపతి అంటే ఆకృతి కాదు-ప్రకృతి అని ఇది సనాతన సంస్కృతికి నిదర్శనమని వివరించారు. భక్తి శ్రద్ధలతో గణనాథున్ని పూజిస్తే అవిఘ్నాలు తొలిగి జీవితంలో సుఖశాంతులు వెల్లివిరుస్తాయని వివరించారు. పది రోజుల పాటు ప్రతి నిత్యం సాయంత్రం 6-30 గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు మహహరతి, తీర్థ ప్రసాధాల వితరణ కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. వినాయక నవరాత్రుల నిర్వహణ ఏర్పాట్లలో చిద్విలాస్, శివ, అగ్నివేష్, అభి, మురళి (లడ్డు) సూర్యనారాయణ, శర్మాజీ, అంబాధాస్, సందీప్, దాసు, శ్రీకాంత్ తదితరులు పాల్గోని నిర్విరామంగా పూజా కార్యక్రమాలను పర్యవేక్షిస్తు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలను పాటిస్తున్నారని శాంత్ కుమార్ తెలిపారు.

## భాజపా నేతల ముందస్తు అరెస్టులు - అప్రజాస్వామికం

**- వెంటనే అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలి**

**- భాజపా చొప్పదండి అసెంబ్లీ కన్వీనర్ : పెరుక శ్రవణ్ కుమార్**



గంగాధర (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ పార్టీ జనహిత యాత్రకు అడ్డంకులు సృష్టిస్తారనే ఉద్దేశ్యంతో బీజేపీ నాయకులు,కార్యకర్తలను ప్రజా ప్రభుత్వం ముందస్తు అరెస్టులు చేయడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. భాజపా చొప్పదండి అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, "జనహిత యాత్రను అడ్డుకుంటామని భ్రమతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ప్రజాస్వామ్య విరుద్ధం. భయంతోనే బీజేపీ నేతలను అరెస్టు చేస్తున్నారు. వెంటనే అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలి, భవిష్యత్తులో జరగబోయే అరెస్టులను నిలిపివేయాలి. లేనిపక్షంలో జరగబోయే జనహిత యాత్రను అడ్డుకుంటాం" అని హెచ్చరించారు.

# ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

**భారీ వర్షాలు నేపథ్యంలో**

**అధికారులు అప్రమత్తంగా ఉండాలి**

**చొప్పదండి ఎమ్మెల్యే : మేడిపల్లి సత్యం**

**మధ్య మానేరు జలాలకు**

**కలెక్టర్,ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు**

**మిడ్ మానేరు రిజర్వాయర్ లో నీటి**

**మట్టం పై ఆరా**





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లాలో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో ప్రాణం ఆస్తి నష్టం సంభవించకుండా ముందస్తుగా అన్ని చర్యలు చేపడుతున్నామని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం తెలిపారు.బోయినిపల్లి మండలంలోని కొదురుపాక మధ్య మానేరు రిజర్వాయర్ వద్ద మానేరు జలాలకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు వద్దకు చేరుకొని ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో పై ఆరా తీశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం ఎంత ఉందో నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టులోకి సిరిసిల్ల మానేరు వాగు, వేములవాడ మూలవాగు నుంచి, ఎస్ఆర్ఎస్పీ, వరద కాలువ నుంచి వరద ప్రవాహం వస్తుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 27. 5టీఎంసీలు కాగా, 21.5 టీఎంసీలు నీరు ఉందని, 75 వేల క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో గా వస్తుందని, ఔట్ ఫ్లో 57 వేల క్యూసెక్కులు ఉందని అధికారులు కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ నీటి మట్టాన్ని పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టు నుంచి నీటి విడుదల చేసిన చేస్తున్న సమయంలో ప్రజలను రైతులను అప్రమత్తంగా ఉండేలా ఎప్పటికప్పుడు సూచనలు చేయాలని ఆదేశించారు. ఎగువ మానేరు ప్రాజెక్టు వద్ద చిక్కుకుపోయిన రైతులను సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ హెలికాప్టర్ ద్వారా క్షేమంగా గమ్యం చేర్చారని వివరించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బిగితే దగ్గరుండి ముమ్మర చర్యలు చేపట్టారని పేర్కొన్నారు ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శ్రేణులు,నీటి పారుదల శాఖ ఈ ఈ కిషోర్, డీఈలు శ్రీనివాస్,అంజయ్య, ఇంచార్జి తహసిల్దార్ భూపేష్ ఎంపీడీవో జయశీల, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 42 శాతం బీసీ రిజర్వేషన్లను

# అడ్డుకుంటున్న బిజెపి

**ప్రత్యేక పార్లమెంట్ సమావేశం నిర్వహించి రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలి**

**టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్)విద్యా ఉద్యోగ స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 42 శాతం బీసీ రిజర్వేషన్లను బిజెపి అడ్డుకుంటుందని టీ పీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. బిజెపికి దమ్ముంటే వెంటనే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు నిర్వహించి బీసీ బిల్లును ఆమోదించాలని, ఇండియా కూటమి పూర్తి మద్దతిస్తుందని ఆయన స్పష్టం చేశారు. వినాయక చవితి సందర్భంగా గాంధీభవన్ లో టీ పీసీసీ ప్రధాన కార్యదర్శులు నాగభూషణం,కొమరయ్య, ఉపాధ్యక్షుడు సురేష్, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ నెల రోజులపాటు పార్లమెంటు సమావేశాలు జరిగితే రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్, మిగతా బీజేపీ ఎంపీలు ప్రధానిని కలిసి 42 శాతం బీసీ రిజర్వేషన్ల అంశాల్ని ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. బిజెపి నేతలకు బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదని ఆయన ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడానికి బిజెపి రకరకాల కుట్రలు చేస్తుందని ఆయన ధ్వజమెత్తారు. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి వద్ద ఉందని వెంటనే ఆమోదించి బీసీలకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న బిజెపికి బీసీలు సరైన రీతిలో గుణపాఠం చెబుతారని, బిజెపి బీఆర్ఎస్ పార్టీలను వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బొంద పెడతారని ఆయన హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని, విజయమే లక్ష్యంగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వినాయక నవరాత్రి వేడుకలు ప్రశాంతంగా ముగియడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. మండప నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు.

# అసత్య ప్రచారాలు నమ్మవద్దు

**గల్లంతు అయిన వ్యక్తి మృతదేహం అంటూ**

**సోషల్ మీడియాలో పోస్ట్ సరికాదు**

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) గంభీరావుపేట మండలం నర్మాల వద్ద నీటి ప్రవాహంలో గల్లంతు అయిన వ్యక్తి తేలుతూ తంగళ్లపల్లి మండలం సమీపంలోని కస్బెకట్కూర్ గ్రామానికి చేరుకున్నదనే సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారం సరికాదని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. మానేర్ నదికి అనుసంధానించబడిన అన్ని గ్రామాలను తాను, అధికారులు పరిశీలించారని పేర్కొన్నారు.



అలాంటి మృతదేహం ఎక్కడా కనిపించలేదని కలెక్టర్ స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ఇలా ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బయటికి రావద్దని కలెక్టర్ తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే కలెక్టరేట్ లోని కంట్రోల్ రూం ను సంప్రదించాలని సూచించారు.

## ప్రభుత్వం నిర్లక్ష్యంతో బోయినిపల్లి

# - వేములవాడ రాకపోకలు బంద్

- గత రెండు ఏళ్లుగా పూర్తికాని స్తంభంపల్లి హై - లెవెల్ వంతెన
- కూలిపోయిన తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కల్వర్టు
- ఎమ్మెల్యే -కాంట్రాక్టర్ డీల్ కుదరకనే వంతెన నిర్మాణ పనులు ఆగిపోయాయా?
- ప్రజల వినతులు - నిరసనలు - ధర్నాలు వృధా..!
  స్తంభంపల్లి గ్రామ ప్రజలకు న్యాయం ఎప్పుడో..!!
- యుద్ధప్రాతిపదికన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- వంతెన నిర్మాణ పనులు చేపట్టాలి
- స్తంభంపల్లి,పరిసర గ్రామాల ప్రజల డిమాండ్





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి - వేములవాడ రాకపోకలు స్తంభంపల్లి గంజివాగు వద్ద హై -లెవల్ వంతెన నిర్మాణ పనులు పూర్తి కాకుండా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కల్వర్టు గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పూర్తిగా కూలిపోయి రాకపోకలు నిలిచిపోయాయి.
ప్రజలకు అత్యవసరమైన స్తంభంపల్లి హై లెవెల్ వంతెన నిర్మాణం రెండు ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైంది. చొప్పదండి నియోజకవర్గంలోని స్తంభంపల్లి గ్రామంలో వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రూ.1.80 కోట్లు మంజూరు చేయగా, పిల్లర్స్ స్థాయి వరకు మాత్రమే పనులు జరిగి ఆగిపోయాయి.
కాంగ్రెస్ ప్రభుత్వం 20 నెలల పాలన పూర్తి చేసుకున్నా పనులు ముందుకు కదలలేదు. స్థానిక ప్రజల వినతులు, పాదయాత్రలు,బైకుయాత్రలు, ధర్నాలు ఏది చేసినా ఫలితం లేకుండా పోయింది. కలెక్టర్, ఎమ్మెల్యేలు సైట్ ఇన్స్పెక్షన్ చేసి వెంటనే పనులు మొదలు పెడతామని హామీ ఇచ్చినా రెండు నెలలు గడిచినా పరిస్థితి అలాగే కొనసాగుతోంది.చిన్న వర్షానికి కల్వర్టు తెగిపోయింది.
గ్రామస్తుల హెచ్చరికలే నిజమయ్యాయి.గురువారం కురిసిన వర్షంతో కల్వర్టు తెగిపోయి చొప్పదండి, వేములవాడ రెండు నియోజకవర్గాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. తాత్కాలికంగా వేసిన రోడ్డు దెబ్బతిన్నా మరమ్మతులు చేయలేదు. కనీసం ప్రమాద సూచికలు కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.

### - "ఎమ్మెల్యే-కాంట్రాక్టర్ డీల్ జరగకే పనులు ఆగిపోయాయి"

వంతెన పనులు నిలిచిపోవడానికి కారణం కాంట్రాక్టర్తో ఎమ్మెల్యే ఒప్పందం కుదరకపోవడమేనని స్థానికులు అనుమానిస్తున్నారు. విద్యార్థులు చదువు దూరం కాకుండా ట్రావెలింగ్ సౌకర్యం కల్పించాలంటూ స్తంభంపల్లి, పరిసర గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.
అంతేకాకుండా గర్భిణీలు, గ్రామ ప్రజలు ఇబ్బందులు పడకుండా స్తంభంపల్లిలో గైనకాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్ వైద్యులను అందుబాటులో ఉంచాలని గ్రామస్థులు కోరుతున్నారు.

### - "ఇప్పటికీ చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు తప్పవు"

"రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం నామమాత్రపు పనులు చేస్తోంది. కలెక్టర్కు పలు వినతులు ఇచ్చాం. నిరసనలు చేశాం. అయినా స్పందన లేదు. ఇప్పటికైనా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చర్యలు తీసుకోకపోతే బోయినిపల్లి మండల ప్రజలందరితో పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తాం" అని స్థానికులు హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, బీజేపీ సీనియర్ నాయకులు బొంగాని అశోక్ గౌడ్, బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులు బత్తిని కమలాకర్,స్తంభంపల్లి మాజీ సర్పంచ్ జ్యోతి - కరుణాకర్, అక్కెనపల్లి అజయ్ కుమార్, సురేష్ కుమార్,తంగళ్ళపల్లి లక్ష్మణ్, శంకరయ్య తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల వల్ల ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్
- అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి
- జిల్లా కేంద్రంతో పాటు అన%శీ%తారం వాగు,ధర్మపురి గోదావరి ప్రాంతాన్ని, రాయపట్నం బ్రిడ్జిని సందర్శించిన జిల్లా ఎస్పీ
- స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, ధర్మపురి సి.ఐ రామ్ నరసింహారెడ్డి, ఎస్సై ఉదయ్ కుమార్



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్) జిల్లా లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పి అశోక్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన%శీ%తారం వద్ద గల వాగును, ధర్మపురి గోదావరి ప్రాంతాన్ని, రాయపట్నం బ్రిడ్జిని సందర్శించారు. ఈ సందర్భంగా నది వద్ద ప్రస్తుత నీటి మట్టం, ప్రవాహం వేగం, సేఫ్టీ బారికేడ్లు, రక్షణ చర్యలను పరిశీలించారు. భారీ వర్షాల వల్ల ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల నుండి నీటి ప్రవాహం కొనసాగుతున్న దృశ్య నీటి ప్రవాహం ఉదృతంగా ఉంటుంది కావున నది పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.నీటి ప్రవాహాని అంచనా వేయకుండా స్నానాలు చేయడానికి నది లోపలికి వెళ్లే ప్రయత్నం చేయవద్దన్నారు. వరద నీటి ఉధృతిని అంచనా వేయకుండా నదులు, కాలువలు, కుంటలు దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. విద్యుత్ స్తంభాల సమీపంలోకి వెళ్లవద్దని సూచించారు.అత్యవసర పరిస్థితిలో తప్ప బయటకు రాకూడదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు,సిబ్బంది ఎల్లప్పుడూ అలర్ట్ గా ఉండాలని, వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాల ప్రభావం, వరద పరిస్థితిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజలను ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారా చైతన్య పర్చాలని సూచించారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్,ధర్మపురి సి.ఐ రామ్ నరసింహారెడ్డి, ఎస్.ఐ ఉదయ్ కుమార్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## మార్కెట్లో వినాయక చవితి వేడుకల్లో చైర్మన్ ఆనంద్



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహానగరంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్న మండప నిర్వాహకులు.రకరకాల రూపాల్లో దర్శనమిస్తున్న ఆ మహాఘననాథుడు.సిటిలోఉన్న పిల్లల్లో ఆనందం రెట్టింపయింది.వినాయకున్నీఏర్పాటు చేసిన మండపాల వద్ద విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించడంతోపాటు పెద్దలు భజనలతో వాడవాడల్లో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.ఈ నేపథ్యంలో నిన్న గురువారం ఉదయం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్యకు పూజలు ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు,వైస్ చైర్మన్ దేవేందర్ పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు."ఆన్ లైన్ లో చైర్మన్ వివరణ"బోయిన్ పల్లి మార్కెట్ లో గత రెండున్నర దశాబ్దాలుగా కమీషన్ ఏజెంట్లు మంచి నీటి ఎద్దడితో తీవ్ర ఇబ్బందులతో బాధపడుతున్న విషయం అందరికి తెలిసిందే!ఈ సంవత్సరం జనవరిలో బాధ్యతలు చేపట్టిన తర్వాత ముఖ్యంగా నీళ్ల సమస్యను పరిష్కరించాలని కమిటీ తీర్మానం చేసుకుంది,అప్పటి నుంచి సంబంధించిన అధికారులతో పాటు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,సిఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి స్థానిక సమస్యలు పై చర్చించాం.మాలో పట్టుదల దృఢంగా ఉండడంతో నీటి కష్టాలకు రేపు నవరాత్రులు పూర్తి అయ్యేలోపే బోయిన్ పల్లి మార్కెట్ లో మంచి నీటి కష్టాలు దూరమైతున్నాయని మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు తెలిపారు.ఆయన చాలా ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి, కార్యదర్శి ఆర్వీసీ చాంద్రారెడ్డి,పాలక సభ్యులు సి..4 కృష్ణ రెడ్డి,డిసి ప్రభాకర్,బాలమల్లు,అంజి, దేవేందర్,ఆర్టీ.రాజు,అంజి తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలతో వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ?

**- జిల్లా వైద్యాధికారి డా. ప్రమోద్**



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్) భారీగా కురుస్తున్న వర్షాలతో రోగాల ముప్పు పొంచే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆగకుండా వానలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట వేసేందుకు జగిత్యాల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైందని జిల్లా వైద్యాధికారి డా. ప్రమోద్ తెలిపారు. ప్రజలు స్వీయ జాగ్రత్తలు పాటించాలని, పరిసరాల పరిశుభ్రతతో పాటు కాచి చల్లార్చిన నీటినే తాగాలని అధికారులు సూచిస్తున్నారు.భారీగా కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ. జలుబు, జ్వరం, దగ్గుతో పాటు దోమలు, కలుషిత నీటితో వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో రోగాల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారని అన్నారు.

### జాగ్రత్తగా ఉండాలి...

ఇండ్లల్లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి. కురుస్తున్న వర్షాలతో నీరు కలుషితం అయ్యే అవకాశాలు ఎక్కువ. సాధ్యమైనంత వరకు బయటి ఆహారం తీసుకోవద్దు. వేడి వేడి ఆహారం తినాలి. జ్వరం, దగ్గు వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. కలుషిత నీరుతో డయేరియా వచ్చే అవకాశం ఉంది. దోమల వృద్ధితో డెంగీ వస్తుంది. ఎట్టి పరిస్థితుల్లో వానలో తడవద్దు. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. సీజనల్ వ్యాధుల విషయంలో సొంత నిర్ణయాలు తీసుకోవద్దన్నారు.

## ఘనంగా పూజలు అందుకున్న గణనాథుడు





నాచారం(ప్రశ్న న్యూస్) నాచారంలో వినాయక చవితి సందర్భంగా గణనాథుడు ఘనంగా పూజలు అందుకున్నాడు. నాచారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీరామ్ సత్యనారాయణ ప్రత్యేకించి ముంబై నుండి సిద్ధి వినాయకుడు విగ్రహం తెప్పించి స్వగృహంలో అంగరంగ వైభవంగా విఘ్నేశ్వరుని పూజలు నిర్వహించారు. లంబోదరుని మండపాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. వివిధరకాల పూలు,పత్రీ తో వినాయకునికి ఇష్టమైన నైవేద్యాలతో అర్చకులు వేదమంత్రాలతో మంగళ వాయిద్యాలుచే వినాయక మంత్రం జపిస్తూ భక్తిశ్రద్ధలతో శ్రీరామ్ సత్యనారాయణ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి కోసం చేసిన అలంకరణ ఎంతో గాను ఆకట్టుకుంది.

# వేములవాడలో అవినీతి పరులకు వణుకు..! రమాదేవి రీ-ఎంట్రీతో గుండెల్లో గుబులు!!

- గతంలో ఈఓ గా పనిచేసిన రమాదేవి
- రాజన్నాలయానికి పునః రంగప్రవేశం
- నిజాయితీ కి మారుపేరు
- ప్రసాదాలను పరీక్షించేందుకు సైతం కొనుక్కొని పరీక్షిస్తారు
- ఆదేశాలు జారీ చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
- భక్తులకు పూర్తి స్థాయిలో సకల సౌకర్యాలు



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ రాజన్నాలయం చరిత్రలో మళ్లీ ఒక సంచలన పరిణామం చోటుచేసుకుంది. గతంలో ఇక్కడ కార్యనిర్వాహక అధికారిగా (ఈఓ) విధులు నిర్వహించిన ఎల్. రమాదేవి తిరిగి బాధ్యతలు చేపట్టబోతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ గురువారం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆలయ పరిసరాలు మరోసారి క్రమశిక్షణ వాతావరణంలోకి వెళ్లబోతున్నాయి. గతంలో రమాదేవి విధులు నిర్వర్తించినప్పుడు అవినీతిపరులు, అక్రమాలకు పాల్పడే సిబ్బందికి చుక్కలు చూపించడం అందరికీ గుర్తుంది. పనితీరులో కఠినత్వం,పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చిన ఆమె కారణంగా ఆలయంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. అప్పట్లో క్రమశిక్షణకు భయపడి వణికిపోయిన అవినీతిపరులు,ఇప్పుడు ఆమె తిరిగి వస్తుందన్న వార్తతో మరోసారి గుండెల్లో గుబులు మొదలైంది.అవినీతితో కుర్చీలు కదిలించుకున్న వారు ఇప్పుడు నిద్రపట్టని రాత్రులు గడపాల్సి వచ్చే పరిస్థితి. ఎవరు ఎంతటి పెద్దవారైనా, రమాదేవి కళ్లల్లో పడ్డాక తప్పించుకోవడం కష్టం అని అందరికీ తెలుసు. స్వామివారి లడ్డూ ప్రసాదాలను పరీక్షించేందుకు సైతం తన సొంత ఖర్చుతో ప్రసాదాలను కొని పరీక్షించడం అంటే ఆమె నిజాయితీ కి మారుపేరు అని అనడంలో ఆశ్చర్యం లేదు. రమాదేవి ఈఓ గా తిరిగి రావడం అంటే నిబంధనల పాఠశాల మళ్లీ ప్రారంభం కావడమే. ఎవరి చేతులు మురికిగా ఉన్నాయో, ఎవరి ఖాతాలు గందరగోళంగా ఉన్నాయో, ఆ లిస్టు ఇప్పటికే మనసుల్లో దడ పెంచుతోంది.వేములవాడ ఆలయంలో రాబోయే రోజులు అవినీతి లేని పరిపాలనకు సంకేతాలు ఇస్తున్నాయి. అయితే, దొంగ చాటుగా లాభాలు పొందినవారి పట్ల రమాదేవి కఠిన చర్యలు తీసుకోవడం ఖాయం అని సిబ్బంది అంచనా వేస్తున్నట్లు సమాచారం."రాజన్న ఆలయంలో రమాదేవి తిరిగి వచ్చిందంటే, అవినీతి చీకట్లు చెదరబోయే సమయం దగ్గరపడింది" అనే మాటలు ఆలయ వర్గాల్లో గుసగుసలాడుతున్నట్లు సమాచారం.ఏదేమైనా భక్తులకు అయితే ఉత్తమ సేవలు,సౌకర్యాలు అందనున్నట్లు, రమాదేవి ఈఓ గా రావడం శుభ పరిణామం అని, ఆమె రీ ఎంట్రీని స్వాగతిస్తున్నామని పలువురు పట్టణ ప్రజలు, పలువురు భక్తులు ముచ్చటించుకుంటున్నట్లు సమాచారం.

# మిడ్ మానేరు గేట్లు ఎత్తివేత

## - వరద పరిస్థితులపై ఆర్డీఓ పర్యటన - సమీక్ష

**వరద నియంత్రణకు అధికారుల సమన్వయం - ఆర్డీఓ ఆదేశాలు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని కొదురుపాక శ్రీ రాజేశ్వర మధ్య మానేరు జలాశయంలో వరదనీటి మట్టం పెరగడంతో అధికారులు గేట్లు ఎత్తిన నేపథ్యంలో, వేములవాడ ఆర్డీఓ రాధాభాయి గురువారం ప్రాజెక్టు పరిసర ప్రాంతాలను మండల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి,పరిశీలించారు.ఈ సందర్భంగా మానువాడ, మల్లాపూర్ గ్రామాల్లో పరిస్థితిని పరిశీలించి, వరద నీటి ఉధృతి,భద్రతా చర్యలపై ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్శనలో ఇంచార్జి తహసీల్దార్ భూపేష్, ఎంపీడీఓ జయశీల, ఇరిగేషన్ సీఈ మధుసూదన్ రెడ్డి, ఈఈ, డీఈలు,సంబంధిత గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ అధికారులకు సూచించారు. అవసరమైతే సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# కామారెడ్డి- నిజామాబాద్ కు వెళ్ళు ఎన్ హెచ్ 44 రోడ్డు మూసివేత




మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ మీదుగా కామారెడ్డి నిజామాబాద్ కు వెళ్ళు ఎన్ హెచ్ 44 రహదారిని మూసివేశారు. ఇటీవల కామారెడ్డిలో కూర్చున్న భారీ వర్షాల వల్ల రోడ్లపై భారీ ఎత్తున వరద నీరు చేరడంతో పాటు రహదారి దెబ్బతినడం వల్ల ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. మేడ్చల్ మీదుగా కామారెడ్డి నిజామాబాద్ కు వెళ్ళు రహదారిని మూసివేస్తున్నట్లు మేడ్చల్ ట్రాఫిక్ సిఐ మధుసూదన్ తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి కి వెళ్ళాలి అన్న కరీంనగర్ మార్గంలో వెళ్లాలని మేడ్చల్ ట్రాఫిక్ సిఐ మధుసూదన్ సూచించారు. వాహనదారులు సహకరించాలని కోరారు. ఈ మేరకు మేడ్చల్ చెక్పోస్ట్ వద్ద ఎన్ హెచ్ 44 రహదారిని మూసివేసినట్లు ట్రాఫిక్ పోలీసులు ఫ్లెక్స్ ని ఫ్లెక్సీ ని ఏర్పాటు చేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ



మేడ్చల్ (ప్రశ్న న్యూస్)మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారురాలకు పట్టాలు పంపిణీ చేశారు.మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ చేతుల మీదుగా పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ మీరు ఏ పార్టీ వారైనా పరవాలేదు,మీరు అర్హులైతే చాలు సంక్షేమ పథకాలు మీ ఇంటికి ముంగటికి వస్తాయన్నారు.లితెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మొదటి విడతలో నిరుపేదలకు పార్టీలకు సంబంధం లేకుండా పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల పంపిణి చేయడం జరిగిందని రాని వారు ఎవ్వరు కూడా అధైర్య పడద్దని ,మూడో విడతలో అందరికి మళ్ళీ ఇందిరమ్మ ఇండ్లు వస్తాయన్నారు. బడుగు బలహీన వర్గాలకు అండగా వుండే పార్టీ కాంగ్రెస్ పార్టీ ప్రతి పేదోనికి సొంతింటి కలను నేర వేర్చడమే కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వ నైజం అన్నారు.ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేసేది కాంగ్రెస్ పార్టీయేనని మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో 75మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరి లబ్ది దారులకు ప్రొసీడింగ్స్ పంపిణి చేసామన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి,మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్,మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ఆర్ టి ఏ అథారిటీ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, గుండ్ల పోచంపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయి పేట శ్రీనివాస్ మున్సిపల్ మేడ్చల్ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహ్మా రెడ్డి,మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ కురుమ,మాజీ కౌన్సిలర్లు జాకట దేవరాజ్,కౌడే మహేష్ కురుమ,రామన్న గారి మణికంఠ గౌడ్,బత్తుల శివ కుమార్ యాదవ్,ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి,నడికొప్పు నాగరాజు ముదిరాజ్,బత్తుల మధుకర్ యాదవ్,పాలకుర్తి రాఘవేందర్ గౌడ్,రొయ్యపల్లి మల్లేష్ గౌడ్,మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోమారం రమణా రెడ్డి,మేడ్చల్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లవంగు రాకేష్ వంజరి తదితరులు పాల్గొన్నారు.

# కారు ప్రమాదం...ఒకరికి గాయాలు



మేడ్చల్( ప్రశ్న న్యూస్) మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేకుల భావి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి తూప్రాన్ వెళుతున్న కారు వేగంగా వెళుతూ అదుపుతప్పి, ఫ్లైఓవర్ ను ఢీకొట్టి, అదే గుంతలో పల్టీ కొట్టి, పడిపోయింది. ఈ ఘటనలో కారు లో ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపైన వ్యక్తిని ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని కాసిం భాయ్ తాండ కు చెందినట్టుగా రమేష్ గా గుర్తించారు.స్థానికులు గాయాల పాలైన వ్యక్తిని బయటకు తీసి, 108 అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించారు.

## ఎమ్మెల్యే సంజయ్ ను పరామర్శించిన కలెక్టర్ సత్యప్రసాద్



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)ప్రజా సంక్షేమంలో భాగంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటూ వెళ్తున్న సందర్భంలో జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ ఎడమ కాలుకు హేయిర్ లైన్ ఫ్రాక్చర్ అయినట్లు తెలిపారు. జగిత్యాల హౌసింగ్ బోర్డ్ లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే సంజయ్ ను జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పరామర్శించారని తెలిపారు. ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# కుబేర తర్వాత.. కమ్ముల మళ్లీ



కొందరు దర్శకులకు కొన్ని బేనర్లతో బాగా సింక్ కుదురుతుంది. గత చిత్రాల ప్రొడక్షన్ విషయంలో ఇబ్బందులు తలెత్తి ఉండొచ్చు లేదంటే కొత్త నిర్మాతలతో కంఫర్ట్ ఉండొచ్చు. కారణమేదైనా వరుసగా ఒక బేనర్లో సినిమాలు చేస్తుంటారు. నిర్మాణ సంస్థలు కూడా తమకంటూ ఆస్థాన దర్శకులు ఉండాలని కోరుకుంటాయి. దిల్ రాజు బేనర్లో ఇలా వరుసగా సినిమాలు చేసిన దర్శకులు చాలామందే ఉన్నారు. హారిక హాసిని సంస్థ ఎన్నో ఏళ్ల నుంచి త్రివిక్రమ్ శ్రీనివాస్‌తోనే సినిమాలు తీస్తోంది. త్రివిక్రమ్ కూడా బయటి బేనర్లకు సినిమాలే చేయట్లేదు. ఈ కోవలోనే శేఖర్ కమ్ముల కూడా ఒక సంస్థతో ట్రావెల్ చేస్తున్నాడు. అదే.. శ్రీ వెంకటేశ్వరా సినిమాస్ ఎల్ఎల్‌పీ. ఏషియన్ మూవీస్ అధినేత సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు కలిసి నడిపిస్తున్న సంస్థ. ఈ బేనర్లో కమ్ముల ఇప్పటికే రెండు సినిమాలు చేశాడు. తొలిసారి ఆ బేనర్లో చేసిన 'లవ్ స్టోరి' ఓ మోస్తరు ఫలితాన్నందుకోగా.. రెండో చిత్రం 'కుబేర' తెలుగు వరకు మంచి విజయాన్నే అందుకుంది. దీంతో మరోసారి ఈ నిర్మాణ సంస్థలో కమ్ముల సినిమా చేయబోతున్నాడు. వినాయక చవితి సందర్భాన్ని పురస్కరించుకుని కమ్ములతో తమ బేనర్లో మరో సినిమా చేయబోతున్న విషయాన్ని ఆ సంస్థ ప్రకటించింది. ఐతే ఇంతకుమించి సినిమా గురించి వివరాలేమీ వెల్లడించలేదు. ఈ ప్రాజెక్టు ఆరంభ దశలోనే ఉందని, కాస్ట్ అండ్ క్రూ గురించి తర్వాత వెల్లడిస్తామని పేర్కొన్నారు. కమ్ముల స్క్రిప్టు రెడీ చేయడానికి, ప్రి ప్రొడక్షన్‌కు చాలా టైం తీసుకుంటాడు.

# హీరోయిన్ మీద కిడ్నాప్ కేసు



తమిళంలో మంచి పేరున్న హీరోయిన్లలో ఒకరైన లక్ష్మీ మీనన్ విచిత్రమైన వివాదంతో వార్తల్లో నిలిచింది. ఆమెపై కేరళలోని కొచ్చిలో కిడ్నాప్ కేసు నమోదు కావడం గమనార్హం. అంతేకాక ఆమె పరారీలో ఉంది. ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆమె కిడ్నాప్ చేసి హింసించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటోంది. ఇంతకీ ఏం జరగిందంటే..?కొచ్చిలో ఇటీవల ఒక బార్ దగ్గర లక్ష్మీ మీనన్, ఆమె స్నేహితులకు.. ఒక ఐటీ ఉద్యోగి బృందంతో గొడవ జరిగింది. ఐతే ఆ గొడవ కాస్త సద్దుమణిగాక కూడా లక్ష్మీ మీనన్, ఆమె స్నేహితులు ఊరుకోలేదు. పంతం పట్టి ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని తమ వాహనంతో వెంబడించారు. ఆ వ్యక్తిని ఒక చోట పట్టుకుని కారులోకి బలవంతంగా ఎక్కించారు. లోపల అతడిపై తీవ్రంగా దాడి చేశారు. దీంతో ఆ ఉద్యోగి తనను కిడ్నాప్ చేసి దాడి చేశారంటూ లక్ష్మీ మీనన్, ఆమె స్నేహితులపై కేసు పెట్టాడు. ఐతే పోలీసులు అరెస్ట్ చేయడానికి వెళ్తే లక్ష్మి వారి చేతికి చిక్కలేదు. ఆమె పరారీలో ఉందని పోలీసులు తెలిపారు. ఆమె కోసం గాలింపు చేపడుతున్నట్లు వెల్లడించారు. లక్ష్మి మీనన్ చాలా చిన్న వయసులోనే సినిమాల్లోకి అడుగు పెట్టింది. తమిళంలో ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టిన 'కుంకి' (తెలుగులో గజరాజు)లో నటించే సమయానికి ఆమె వయసు 19 ఏళ్లే. కోలీవుడ్లో ఇంకా పాండియనాడు, నాన్ సిగప్పు మనిదన్, జిగర్ తండా లాంటి సూపర్ హిట్ సినిమాల్లో ఆమె నటించింది. మాతృ భాష మలయాళమే అయినా ఆమెకు తమిళంలోనే మంచి పేరు వచ్చింది. డబ్బింగ్ సినిమాలతో లక్ష్మికి తెలుగులోనూ మంచి గుర్తింపే లభించింది. ఈ మధ్య ఆమెకు కాస్త సినిమాలు తగ్గాయి. ఇలాంటి టైంలో ఈ వివాదంతో వార్తల్లోకి వచ్చింది.

# అఖండ 2 ప్రోగ్రెస్..



నందమూరి అభిమానులు విపరీతమైన ఎగ్జైట్ మెంట్ తో ఎదురు చూస్తున్న అఖండ 2 విడుదల సెప్టెంబర్ 25 ఉండదనే క్లారిటీ దాదాపు వచ్చినట్టే. నిజానికి ఈ డేట్ ని ఎలాగైనా చేరుకోవాలనే లక్ష్యంతో దర్శకుడు బోయపాటి శీను తన రెగ్యులర్ స్టైల్ ని పక్కనపెట్టి మరీ షూటింగ్ వేగంగా చేశారు. బాలకృష్ణ పూర్తిగా సహకరించి సకాలంలో డబ్బింగ్ కూడా అయిపోగొట్టేసి టీమ్ కి టెన్షన్ లేకుండా చేశారు. అయినా సరే పోస్ట్ ప్రొడక్షన్ పనులతో పాటు విఎఫెక్స్ వర్క్స్ ఇంకా పెండింగ్ ఉండటంతో ఒత్తిడి తీసుకోవడం ఇష్టం లేక వాయిదా నిర్ణయం తీసుకున్నారని ఇన్ సైడ్ టాక్. కొత్త డేట్ ఇంకా ప్రకటించలేదు. అదే రోజు ఓజి ఉంది కాబట్టి పోస్ట్ పోన్ చేస్తున్నారనే ప్రచారంలో నిజం లేదనేది యూనిట్ చెబుతున్న మాట. దసరా సెలవులు ఉంటాయి కాబట్టి క్లాష్ ఉన్నా లేకపోయినా అఖండ 2 చూసే ఆడియన్స్ శాతం ఎంత మాత్రం తగ్గిపోదని అంటున్నారు. సరే దీని సంగతలా ఉంచితే రాజా సాబ్ వదులుకోబోయే డిసెంబర్ 5న అఖండ 2 రావొచ్చనే ప్రచారానికి ఇంకా అధికారిక ముద్ర పడాల్సి ఉంది. ఎలాగూ 2026 సంక్రాంతి ప్యాక్ అయిపోయింది కాబట్టి అప్పటిదాకా ఆగే ఛాన్స్ లేదు. పుష్ప 2, యానిమల్, అఖండ గతంలో డిసెంబర్ లోనే వచ్చి బ్లాక్ బస్టర్లు సాధించి రికార్డులు తుడిచిపెట్టాయి. సో అది ఖచ్చితంగా మంచి ఆప్షనే. ప్రమోషన్లు మాత్రం అఖండ 2కి ఇప్పట్లో మొదలుపెట్టేలా లేరు. ఒకవేళ డిసెంబర్ అయితే ఇంకా చాలా టైం ఉంది కాబట్టి వెయిట్ చేస్తారు. తమన్ పాటలు ఇంకా బయటికి రాలేదు. ఈసారి అదిరిపోయే ఆల్బమ్ ఉంటుందని ఫ్యాన్స్ చాలా ఆశలు పెట్టుకున్నారు. సంయుక్త మీనన్ హీరోయిన్ గా నటించిన ఈ డివోషనల్ యాక్షన్ డ్రామాలో ఆది పినిశెట్టి విలన్ గా నటించాడు. రషెస్ చూసిన వాళ్ళు కంటెంట్ టెర్రిఫిక్ గా ఉందని, అఖండని మించి విజువల్స్ అదిరిపోయాయని అంటున్నారు. అదే నిజమైతే మాత్రం బాలయ్య విశ్వరూపానికి ఈసారి ఎలాంటి రికార్డులు బద్దలు కాబోతున్నాయో చూడాలి.

# పేరు మార్చుకుని వచ్చిన మంచు లక్ష్మి



మోహన్ బాబు ఘన వారసత్వాన్ని కొనసాగిస్తూ మంచు ఫ్యామిలీ నుంచి వచ్చిన ముగ్గురు తారల్లో ఎవరి కెరీర్ కూడా ఆశించినంత గొప్పగా లేదు. గత దశాబ్ద కాలంగా ముగ్గురూ స్ట్రగులవుతూనే ఉన్నారు. చాలా గ్యాప్ తర్వాత 'కన్నప్ప' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విష్ణు.. కోరుకున్న విజయాన్ని అందుకోలేకపోయాడు. మంచు మనోజ్ రీఎంట్రీ మూవీ 'భైరవం' కూడా అంచనాలను అందుకోలేకపోయింది. మరోవైపు మంచు లక్ష్మి తెరపై కనిపించి చాలా కాలమైంది. ఆమె ఎప్పుడో పూర్తి చేసిన సినిమా 'అగ్నినక్షత్రం' సంగతి అసలేమైందో కూడా తెలియదు. ఐతే ఇప్పుడు సడెన్‌గా లక్ష్మి 'దక్ష' అనే సినిమా టీజర్‌తో పలకరించింది. ఐతే ఇదేమీ కొత్త సినిమా కాదు. 'అగ్నినక్షత్రం' చిత్రానికే పేరు మార్చారు. వినాయక చవితి కానుకగా ఈ సినిమా టీజర్‌ను లాంచ్ చేశారు. అది కొంచెం ఇంట్రెస్టింగ్‌గానే ఉంది. విచిత్రమైన వేషధారణతో హత్యలు చేసే ఒక కిల్లర్‌ను వెతికి పట్టుకునే పోలీసాఫీసర్ కథ ఇది. విలన్ పాత్రే సినిమాలో హైలైట్‌గా ఉండేలా కనిపిస్తోంది. ఇలాంటి క్రైమ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్లు ఓటీటీల్లో బోలెడు చూస్తున్నాం. సినిమాలు కూడా పెరుగుతున్నాయి. ట్రెండుకు తగ్గ కథనే ఎంచుకుని రేసీ స్క్రీన్ ప్లేతో నడిపించాలని చూసినట్లున్నాడు దర్శకుడు వంశీకృష్ణ. లక్ష్మి పాత్ర పవర్ ఫుల్‌గానే కనిపిస్తోంది. ఒక డైలాగ్‌తో మాస్ చూపించింది లక్ష్మి. ఇందులో మోహన్ బాబు సైతం ఓ ముఖ్య పాత్ర పోషించాడు. టీజర్లో కొసమెరుపులా ఆయన పాత్ర కనిపించింది.

# రోహిత్ ఆనందానికి వర్షం బ్రేకులు



చాలా గ్యాప్ తర్వాత సోలో హీరోగా నారా రోహిత్ చేసిన సినిమా సుందరకాండ. నిజానికిది ఏడాది క్రితమే విడుదల కావాల్సింది. రకరకాల కారణాల వల్ల వాయిదా పడుతూ వినాయక చవితి పండక్కి మోక్షం దక్కించుకుంది. కంటెంట్ మీద కాన్ఫిడెన్స్ తో హైదరాబాద్ లో ముందు రోజే ప్రీమియర్లు వేయడం టాక్ పరంగా పనికొచ్చింది. చూసినవాళ్లు బాగుందని, మంచి ప్రయత్నమని మెచ్చుకోవడం సోషల్ మీడియాలో కనిపించింది. మరీ హిలేరియస్ కాదు కానీ ఉన్నంతలో నవ్వించడానికి టీమ్ పెట్టిన ఎఫర్ట్ సక్సెసయ్యిందని మెచ్చుకున్నారు. భైరవం కన్నా బెటర్ రివ్యూలు సుందరకాండకు కనిపించాయి. కానీ రోహిత్ ఆనందానికి వర్షం బ్రేక్ వేస్తోంది. తెలంగాణలో వర్షాలు భీకరంగా పడుతున్నాయి. ముఖ్యంగా కామారెడ్డి నుంచి ఆదిలాబాద్ తదితర ప్రాంతాల వైపు వాతావరణం వరదని మించి ఉంటోంది. హైదరాబాద్ తో పాటు ఇతర నగరాలకు రెడ్ అలెర్ట్ ఇచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో జనాలు థియేటర్ కు రావడం అంత సులభంగా ఉండదు. పైగా రోహిత్ కు మంచి టేస్ట్ ఉందనే అభిప్రాయం జనంలో ఉన్నా తనేమి ఓపెనింగ్స్ తీసుకొచ్చే క్రౌడ్ పుల్లర్ కాదు. బాగుందనే మాట మెల్లగా పాకితే జనం రావడం మొదలు పెడతారు. కానీ ఇప్పుడొచ్చిన డీసెంట్ టాక్ కలెక్షన్లుగా మారాలంటే వర్షాలు తెరిపినివ్వాలి. ఆంధ్రప్రదేశ్ లోనూ వర్షాలు పడుతున్నాయి. వినాయక మండపాలు సైతం ఇబ్బందులు పడుతున్న వైనం టీవీలో చూస్తున్నాం. పండగ ప్లస్ లాంగ్ వీకెండ్ కలిసి వస్తుందనే ఉద్దేశంతో బిజినెస్ మీద చాలా ఆశలు పెట్టుకున్న సుందరకాండ బృందానికి వర్షాలు షాక్ ఇస్తున్నాయి. రేపో ఎల్లుండో తగ్గితే శని ఆదివారాలు మెరుగైన ఆక్యుపెన్సీలు చూడొచ్చు. ప్రేమకథల్లో ఇప్పటిదాకా ఎవరూ టచ్ చేయని పాయింట్ తీసుకున్న దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి మొదటి ప్రయత్నంలో మంచి ప్రశంసలే అందుకున్నాడు. మరి అవి వసూళ్లుగా మారతాయో లేదో సోమవారానికి క్లారిటీ వచ్చేస్తుంది. చూద్దాం.

# తేజ సజ్జ సినిమాకు బడా సంస్థల అండ

తేజ సజ్జ రొట్టె విరిగి నేతిలో పడేలా ఉంది. సెప్టెంబర్ 12 విడుదల కాబోతున్న ఈ విజువల్ గ్రాండియర్ కోసం ఇతర రాష్ట్రాల్లో బడా సంస్థలు రంగంలోకి దిగుతున్నాయి. హిందీ వెర్షన్ ధర్మ ప్రొడక్షన్స్ తరఫున కరణ్ జోహార్ తీసుకోగా, కర్ణాటకలో కెజిఎఫ్ నిర్మాణ సంస్థ హొంబాలే ఫిలింస్ రంగంలోకి దిగింది. తమిళనాడులో ఏజిఎస్ సినిమాస్ ముందుకు వచ్చిందంటే థియేటర్ల పరంగా వచ్చే అతి పెద్ద సమస్య తీరినట్టే. మలయాళంలో గోకులం అండదండలు దొరకడమంటే మాములు విషయం కాదు. తెలుగు రాష్ట్రాల పంపిణీదారులు ఇంకో రెండు మూడు రోజుల్లో ఫైనల్ కాబోతున్నారు. మొత్తానికి ప్యాన్ ఇండియా స్కెచ్ పెద్దగానే ఉంది.హనుమాన్ తర్వాత తేజ సజ్జ మిరాయ్ కోసమే రెండేళ్లు ఖర్చు పెట్టుకున్నాడు. మధ్యలో చాలా ఆఫర్లు వచ్చినా ఒప్పుకోలేదు. మార్కెట్ ని పెంచుకునే లక్ష్యంతో వయసుకి మించి కష్టపడ్డాడు. బజ్ కూడా అదే స్థాయిలో పెరుగుతోంది. ఈగల్ ఫేమ్ కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన ఈ ఫాంటసీ డ్రామాలో బలమైన డివోషనల్ ఎలిమెంట్ ఉందట. టీజర్ లో శ్రీరాముడు ఉండొచ్చనే హింట్ ఇచ్చారు కాబట్టి ఆ కోణం కనక సరిగ్గా వర్కౌట్ అయితే ఉత్తరాది ప్రేక్షకులు ఎగబడి చూస్తారు. నిఖిల్ కార్తికేయ 2 అంత బ్లాక్ బస్టర్ కావడానికి కారణం ఇదే. మిరాయ్ లోనూ అలాంటి అంశాలు పుష్కలంగా ఉన్నాయట. మిరాయ్ కి తొలి రెండు వారాలు కీలకం కాబోతున్నాయి. సెప్టెంబర్ 25 ఓజి వస్తుంది కాబట్టి ఆలోగానే తెలుగు రాష్ట్రాల్లో వీలైనంత రాబట్టుకోవాలి. పెద్ద మొత్తంలో పెట్టుబడులు పారుతున్న నేపథ్యంలో ఏపీ తెలంగాణలో ఓజికి అతి పెద్ద రిలీజ్ దక్కనుంది. ఒకవేళ మిరాయ్ కనక హనుమాన్ రేంజ్ టాక్ తెచ్చుకుంటే మూడో వారంలోనూ కొనసాగే ఛాన్స్ ఉంటుంది. సెప్టెంబర్ 12 రావాల్సిన దుల్కర్ సల్మాన్ తప్పుకోవడం మిరాయ్ కి కలిసి వచ్చే అంశమే. అదే రోజు విజయ్ ఆంటోనీ భద్రకాళి ఉంది కానీ దాన్ని మరీ పెద్ద కాంపిటీషన్ గా భావించాల్సిన అవసరం




# ఫ్యాన్స్ అడిగింది ఇచ్చేలా



ఓజి నుంచి రెండో ఆడియో సింగల్ రిలీజయ్యింది. సువ్వి సువ్వి అంటూ స్మూత్ గా సాగే మెలోడీని తమన్ కంపోజ్ చేసిన తీరు, గాయని శృతి రంజని పాడిన విధానం రెండూ మ్యూజిక్ లవర్స్ ని వెంటనే కనెక్ట్ అయ్యేలా చేస్తున్నాయి. కళావతిలాగా టైం పట్టకుండా త్వరగా ఎక్కువ రీచ్ వచ్చే అవకాశం ఖాయంగా కనిపిస్తోంది. నిజానికి తమన్ స్థాయి పాట విని చాలా రోజులయ్యింది. ఓజి టైటిల్ సాంగ్ ఫ్యాన్స్ ని ఊపేసినప్పటికీ సాధారణ ప్రేక్షకులు మళ్ళీ మళ్ళీ వినాలనిపించే స్థాయిలో ఇంకా పూర్తి స్థాయిలో ఛార్ట్ బస్టర్ కాలేదు. కానీ ఇప్పుడీ సువ్వి సువ్వి క్లాసు, మాస్ తేడా లేకుండా అందరికీ చేరువయ్యేలా ఉంది.కల్యాణ చక్రవర్తి రాసిన లిరిక్స్ సింపుల్ గా టచింగ్ గా ఉన్నాయి. పల్లవికి చరణలకు మధ్యలో తమన్ వాడిన ఫ్లూట్ లాంటి వాయిద్యాలు ఒక నోస్టాల్జియా ఫీలింగ్ తీసుకొచ్చాయి. 90 దశకంలో సాగే స్టోరీ కాబట్టి ఆ మూడ్ కు తగ్గట్టు కంపోజ్ చేయడానికి తీసుకున్న శ్రద్ధ సాంగ్ లో బాగా వినిపించింది. విజువల్ గా రివీల్ చేసిన పవన్ కళ్యాణ్, ప్రియాంక మోహన్ కెమిస్ట్రీ బాగుంది. వయసు వ్యత్యాసం గురించి గతంలో కామెంట్స్ వచ్చినప్పటికీ ఆన్ స్క్రీన్ మాత్రం క్యూట్ పెయిర్ అనిపించేలా దర్శకుడు సుజిత్ డిజైన్ చేసిన విధానం బాగుంది. సో ఓజి నుంచి వచ్చిన రెండు పాటలూ సూపర్ హిట్టేనని చెప్పొచ్చు. సెప్టెంబర్ 25 విడుదల కాబోతున్న ఓజి హైప్ అప్పుడే ఎక్కడం మొదలయ్యింది. హరిహర వీరమల్లు గాయాన్ని పట్టించుకోకుండా ఫ్యాన్స్ అప్పుడే బెనిఫిట్ షో టికెట్ల కోసం మంతనాలు మొదలుపెట్టారు. తెలివిగా ప్లాన్ చేసుకున్న నార్త్ అమెరికా అడ్వాన్స్ బుకింగ్స్ లో అప్పుడే ఓజి ఆధిపత్యం కనిపిస్తోందని అక్కడి డిస్ట్రిబ్యూటర్ల టాక్.

## నర్మాల వరదబాధితుల రక్షణలో

# హెలికాప్టర్ ఆపరేషన్

**- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్ పర్యవేక్షణలో సహాయక చర్యలు**



గంభీరావుపేట (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట మండలం,నర్మాల గ్రామంలో వరద ప్రభావం తీవ్రంగా పెరగడంతో అనేక కుటుంబాలు ఇరుక్కుపోయాయి. ఈ పరిస్థితిని గమనించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వెంటనే స్పందించి మంత్రివర్గంతో చర్చించారు. హెలికాప్టర్ల ద్వారా సహాయక చర్యలు చేపట్టాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.రక్షణశాఖతో సమన్వయంతో హెలికాప్టర్లు అందించేందుకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ రక్షణశాఖ మంత్రితో నేరుగా మాట్లాడి చర్యలు తీసుకున్నారు. ఫలితంగా రెండు హెలికాప్టర్లు నర్మాల కు చేరుకొని సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి.విప్ ఆది శ్రీనివాస్ నర్మాల క్యాంపులోనే ఉండి,జిల్లా కలెక్టర్,ఎస్పీలతో కలిసి మొత్తం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. హెలికాప్టర్ల సహాయంతో వరద ప్రాంతాల్లో చిక్కుకున్న బాధితులను ఒక్కొక్కరిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.ప్రభుత్వ చొరవపై ప్రజల సంతోషం,సహాయక చర్యలు వేగంగా జరిగిపోతున్నందుకు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.వరదలో చిక్కుకున్న అనేక కుటుంబాలు సురక్షితంగా బయటపడ్డాయి.

## వేములవాడలో గణనాథునికి

# ఘనంగా ప్రత్యేక పూజలు



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలోని బద్దిపోచమ్మ ఏరియాలో రాజన్న యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీగా ఏర్పాటు చేసిన మండపంలో విఘ్నేశ్వరుని విగ్రహాన్ని ఆకర్షణీయంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ పూజల్లో యూత్ సభ్యులతో పాటు స్థానిక పలువురు దంపతులు,కుటుంబాలతో కలిసి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మండపాన్ని పూలతో,విద్యుత్ వెలుగులతో అద్భుతంగా అలంకరించగా, చుట్టుపక్కల ప్రాంతమంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది. గణనాథుని ఆరాధనలో భాగంగా మంత్రోచ్చారణలు, ప్రత్యేక హోమాలు నిర్వహించగా, భక్తులు 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో గగనతలం మార్మోగించారు.సాయంత్రం భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. భక్తుల తాకిడి మరింత పెరగనుందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

# బీసీ బిల్లుపై మోడీకి ఎందుకు ఒత్తిడి చేయలేదో భాజపా చెప్పాలి

- బండి సంజయ్ వ్యాఖ్యలపై ఆది శ్రీనివాస్ కౌంటర్
- రాముని పేరుతో ఓట్ల కోసం అక్షింతలు పంపింది బీజేపీ కాదా?
- మహేష్ గౌడ్ పై బండి సంజయ్ వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాం
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే : ఆది శ్రీనివాస్



వేములవాడ (ప్రశ్న న్యూస్) పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ హక్కులు, బీజేపీ హామీల అమలు, ఎన్నికల లోపాలపై బండి సంజయ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.వేములవాడ పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ , "బీసీ బిడ్డగా మీరు ఉన్నారు కదా? మరి బీసీ బిల్లుపై నరేంద్ర మోడీని ఎందుకు ఒత్తిడి చేయడం లేదు? 11 ఏళ్ల బీజేపీ పాలనలో పేదల కోసం ఏం చేశారు? జన్ ధన్ ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పింది బీజేపీ కాదా? ఆ హామీలకు ఏమైంది?" అని నిలదీశారు.మహేష్ కుమార్ గౌడ్ బీజేపీ వైఫల్యాలను ప్రశ్నించగా వ్యక్తిగత విమర్శలు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించిన ఆయన, "బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంది ఎవరు? నోటికాడికి మాటలు చెప్పడం మానేసి వాస్తవాలు చెప్పండి" అని సంజయ్ పై ధ్వజమెత్తారు.ఎన్నికల్లో ఓటు దోపిడీ ఆరోపణలపై కూడా ఆది శ్రీనివాస్ విరుచుకుపడ్డారు. "కర్ణాటకలో ఒక్క నియోజకవర్గంలో ఆరు నెలల్లో లక్ష ఓట్లు ఎలా వచ్చాయి? కౌంటింగ్ సమయంలో మెజారిటీ ఉన్న మా అభ్యర్థులు ఒక్కసారిగా ఎలా ఓడిపోయారు? కరీంనగర్‌లో ఒక ఇంట్లో 30 ఓట్లు ఎలా వచ్చాయి? మహేష్ గౌడ్ అడిగిన ప్రశ్నలకు సమాధానం ఎందుకు ఇవ్వట్లేదు?" అని ప్రశ్నల వర్షం కురిపించారు.మతాన్ని రాజకీయాలకు వాడుకునే బీజేపీ పై ఆది శ్రీనివాస్ తీవ్రంగా స్పందించారు. "మేము హిందువులమే. ప్రతిరోజూ దేవుని ఆరాధిస్తాం. కానీ మీలా దేవుని పేరుతో ఓట్లు అడగం. పార్లమెంట్ ఎన్నికల ముందు రాముని పేరుతో అక్షింతలు పంపి ఓట్లు అడిగింది బీజేపీ కాదా?" అని ఘాటుగా నిలదీశారు.రోహింగ్యాల చొరబాటును అడ్డుకోలేకపోవడంపై కూడా భాజపా వైఫల్యాన్ని ఎత్తిచూపారు. "దేశంలోకి రోహింగ్యాలు చొరబడుతున్నారంటున్నారు కదా? మరి 11 ఏళ్లుగా ఏం చేస్తున్నారు? వారిని ఎందుకు వెనక్కు పంపలేకపోతున్నారు?" అని దుమ్మెత్తిపోశారు."ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తే మతం పేరుతో దాన్ని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. మహేష్ గౌడ్‌పై చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ ఖండిస్తోంది" అని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# దేవతలగుట్టపై వినాయక నవరాత్రులు ఉత్సవాలు

బడంగ్ పేట్(ప్రశ్న న్యూస్) బాలాపూర్ మండల పరిధిలోని ప్రాచీన దేవతలగుట్ట స్వయంభూ హనుమాన్ ఆలయంలో వినాయక నవరాత్రి పూజా కార్యక్రమాలు విజయవంతంగా ప్రారంభించబడిన్నాయని ఆలయ ధర్మకర్త మందాడి శివారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వినాయక చవితి సందర్భంగా దేవతలగుట్ట స్వయంభూ హనుమాన్ ఆశీస్సులతో గత పది సంవత్సరాలుగా వినాయక నవరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. వినాయక విగ్రహాన్ని చేసేది మట్టితో, అలంకరించేది పూలతో, పూజించేది ఆకులతో (పత్రి) నిమ్మజ్జనం చేసేది నీటిలో, గణపతి అంటే ఆకృతి కాదు-ప్రకృతి అని ఇది సనాతన సంస్కృతికి నిదర్శనమని వివరించారు. భక్తి శ్రద్ధలతో గణనాథున్ని పూజిస్తే అవిగ్నాలు తొలిగి జీవితంలో సుఖశాంతులు



వెల్లివిరుస్తాయని వివరించారు. దేవతల గుట్టపై నిర్వహించిన వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో అధిక సంఖ్యలో పాల్గోన్న భక్తులు గణనాథుని దర్శించుకొని పూజలో పాల్గోని తీర్థప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. ఈ పూజ కార్యక్రమం నిర్వహించడానికి సహకరించిన దేవతగుట్ట గణేష్ ఉత్సవ సభ్యులు సాకేత్, వినీత్, సంతోష్ రెడ్డి, విజయ్, రాజేశ్, మధుకర్



రెడ్డి, ఆలయ పూజారి ఇంద్రమణి దూబే తదితరులు పాల్గోన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమాభివృద్ధిలో రాష్ట్రం ముందుకెళ్లాలి

**- వినాయక చవితి సందర్బంగా ఆధ్యాత్మిక సందర్శనలో...!**
**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..!!**



వేములవాడ (ప్రశ్న న్యూస్) గణేష్ నవరాత్రోత్సవాలలో భాగంగా గురువారం రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీ గణపతి స్వామివారిని కూడా దర్శించి,పట్టణంలోని పలు వినాయక మండపాలలో కొలువుదీరిన గణనాధులను దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "వినాయక చవితి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం,శాంతి నింపాలని కోరుకుంటున్నాను. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగాలి" అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తోందని వెల్లడించారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పనులు వేగంగా సాగాలని, ఎలాంటి ఆటంకాలు రాకూడదని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం,అభివృద్ధి మరింత ముందుకు సాగాలని విఘ్నేశ్వరుడిని కోరినట్లు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

# రాజన్న సేవలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**- మంత్రికి పుష్పగుచ్చం అందజేసి ఘన స్వాగతం**
**పలికిన ఆలయ ఈఓ : రాధాభాయి**



వేములవాడ ( ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు విచ్చేసిన నేపథ్యంలో ఆలయ ఈఓ రాధాభాయి మంత్రికి పుష్పగుచ్చం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించడంతో పాటు స్వామివారికి అత్యంత ప్రీతి పాత్రమైన కోడె మొక్కు చెల్లించారు. దర్శనం అనంతరం కళ్యాణ మండపంలో వేద పండితులు, ఆలయ అర్చకులు మంత్రికి వేదోక్త ఆశీర్వచనాలు అందించారు.వారికి ఆలయ కార్యనిర్వాహణాధికారి (ఈఓ) రాధాబాయి స్వామివారి శేషవస్త్రం సమర్పించి,లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారి జి. శ్రవణ్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ, ఆలయ పరిశీలకులు నూగూరి నరేందర్, ప్రోటోకాల్ సీనియర్ అసిస్టెంట్ బొడుసు మహేష్, జూనియర్ అసిస్టెంట్ సింహాచార్యులు,తదితర ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# "శ్రీ వేణుగోపాల స్వామి యూత్" ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రోత్సవాలకు శ్రీకారం

**- ప్రతి నిత్యం ప్రత్యేక పూజలు...! అన్నదాన సేవలు..!! - నిర్వాహకులు**

వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ మున్సిపల్ పరిధిలోని 21వ వార్డులో శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం వెనుక తొలిసారిగా "శ్రీ వేణుగోపాల స్వామి యూత్" సభ్యుల ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రోత్సవాలకు ఘనంగా శ్రీకారం



చుట్టారు.బుధవారం ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో గణనాథుడిని అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రతిష్టించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ప్రతి రోజూ ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు అన్నదాన సేవలు నిర్వహించనున్నట్లు, అలాగే ఈ నెల శుక్రవారం ఘనంగా "కుంకుమ పూజ" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నామని వివరించారు.వార్డులోని,పట్టణంలోని భక్తులు,ప్రజలు ప్రతినిత్యం పూజలు, భజనలలో,అన్నదాన సేవా కార్యక్రమాలలో అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# చుంచుపల్లి మండల ప్రెస్ క్లబ్ ఏర్పాటు







కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) సీనియర్ జర్నలిస్టుల సమక్షంలో గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండల ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా గుణ సురేష్ (ఆంధ్రజ్యోతి), కార్యదర్శి సాంసన్ రాజు, ట్రెజరర్ అరుణ్ (నమస్తే తెలంగాణ), సహాయ కార్యదర్శి1 స్వామి (మన తెలంగాణ), సహాయ కార్యదర్శి2 కిరణ్ కుమార్ (ఆంధ్రప్రభ), గౌరవ అధ్యక్షులు గా సీనియర్ పాత్రికేయులు వాహబ్ (నవ భూమి), షఫీ (సూర్య), రాము (సాక్షి), గౌరవ సలహాదారులుగా డివి (నవతెలంగాణ), శంకర్ (వార్త), ప్రభాకర్ రెడ్డి, శివ శంకర్ (దిశ), అశోక్ (ప్రజా జ్యోతి), అఫ్జల్ పఠాన్ (తెలంగాణ వాణి), క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా రాజేందర్ (వెలుగు), శివమూర్తి (మనం), హరి (ప్రజాతంత్ర), ప్రసాద్ (మెట్రో) లను ఎన్నుకోవడం జరిగింది.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు - రూ.1 వేయి జరిమానా

**- సమాజంలో శిక్షలతోనే మార్పు సాధ్యం**
**- జిల్లా ఎస్పీ : మహేష్ బీ గితే**





వేములవాడ / ముస్తాబాద్ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లాలో చోటుచేసుకున్న హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.1 వేయి జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రధాన న్యాయమూర్తి నీరజ గురువారం తీర్పు వెలువరించారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బీ గితే వెల్లడించారు.

### కేసు వివరాలు

జిల్లా ఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం : ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన సిర్రం మహేష్ (46) వేములవాడలో కూలీ పనులు చేస్తూ కిరాయికి ఉంటున్నాడు. ఈ క్రమంలో అతనికి దర్ర తిరుపతితో పరిచయం ఏర్పడింది. తిరుపతి మద్యం బారిన పడి గది రెంటు చెల్లించకపోవడంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. 1-4-2024న సిర్రం మహేష్ రూమ్‌లో నిద్రిస్తున్న సమయంలో, "నా పరువు తీసాడు" అనే ఆగ్రహంతో దర్ర తిరుపతి పెద్ద సిమెంట్ రాయితో మహేష్ తలపై బాదాడు. మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మహేష్ భార్య పద్మ ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపారు.విచారణ అధికారి సీఐ వీరప్రసాద్ సమగ్ర దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీంద్ర నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ మహేందర్, సిఎంఎస్ కానిస్టేబుల్ నవీన్‌లు సహకరించారు. 17 మంది సాక్షులను ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ వాదించారు. న్యాయమూర్తి నేరం రుజువైందని తేల్చి జీవిత ఖైదు, రూ.1,000 జరిమానా విధించారు.

### ఎస్పీ ప్రతిస్పందన

"జిల్లాలో నేరం చేసిన ఎవరూ శిక్ష నుంచి తప్పించుకోలేరు. శిక్షలతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుంది. పోలీసులు, ప్రాసిక్యూషన్ వ్యూహాత్మకంగా పని చేస్తే నేరస్థులకు కచ్చితంగా శిక్షలు పడతాయి," అని ఎస్పీ మహేష్ బీ గితే అన్నారు. ఈ కేసులో కృషి చేసిన సీఐ వీరప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్, ఎస్సై రవీంద్ర నాయుడు, కానిస్టేబుళ్లు మహేందర్, నవీన్‌లను ఆయన అభినందించారు.

## ఎమ్మెల్యే డా సంజయ్ కాలుకు

# హెయిర్ లైన్ ఫ్రాక్చర్

**-పరామర్శించిన డీఎస్పీ రఘుచందర్, టౌన్ సీఐ కరుణాకర్**
**-పరామర్శిసున్న అధికారులు, నాయకులు, నియోజకవర్గ ప్రజలు**
**-తొందరగా కోలుకోవాలంటూ విఘ్నేశ్వరుడిని వేడుకుంటున్న ప్రజలు**



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)ప్రజా సంక్షేమంలో భాగంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటూ వెళు_న్న సందర్భంలో జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ ఎడమ కాలుకు హెయిర్ లైన్ ఫ్రాక్చర్ అయినట్లు తెలిపారు. జగిత్యాల హౌసింగ్ బోర్డ్ లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే సంజయ్ ను డీఎస్పీ రఘుచందర్, టౌన్ సీఐ కరుణాకర్ పరామర్శించారని తెలిపారు. అధికారులు, నాయకులు, నియోజకవర్గ ప్రజలుఎమ్మెల్యే డా సంజయ్ ను పరమర్శిస్తున్నారు.నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే డా సంజయ్ తొందరగా కోలుకోవాలంటూ విఘ్నేశ్వరుడిని వేడుకుంటున్నారు.

# రోడ్లపై అదుపులేని లారీలతో అమాయకుల ప్రాణాలు బలి

## అతివేగం ప్రమాదకరం అంటూనే ఇస్తానుసారంగా నడుపుతున్న లారీ డ్రైవర్లు

- మద్యం తాగి వాహనాలు నడిపే డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి
హైవేలపై ప్రత్యేక డ్రింక్-డ్రైవ్ చెకింగ్ నిర్వహించాలి
వాహన యజమానులు కూడా మత్తులో వాహనాలు నడిపే డ్రైవర్లను
నియమించకుండా కఠినంగా పర్యవేక్షించాలి
రోడ్డుప్రమాదాలకు కారణమవుతున్న మాంద్యం మత్తులో డ్రైవింగ్
- ప్రజల ప్రాణాలు బలైపోతున్నాయి
స్కూల్ జోన్, జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వేగం నియంత్రణ తప్పనిసరి చేయాలి
ట్రాఫిక్ పోలీసులు తరచూ తనిఖీలు చేసి నిర్లక్ష్య డ్రైవింగ్ను ఆపాలి
లారీ డ్రైవర్లకు తప్పనిసరి శిక్షణా తరగతులు ఉండాలి
రాత్రి పూటలు అలసట చెక్ తప్పనిసరి చేయాలి
మద్యం పరీక్షలు తరచూ నిర్వహించాలి
ట్రాఫిక్ సిగ్నల్ వద్ద సీసీ కెమెరాల ద్వారా నిఘా పెంచాలి
ప్రాణాలను రక్షించేది ప్రభుత్వం, పోలీసుల చర్యలే కాదు, డ్రైవర్లలో బాధ్యతా భావం కూడా. ప్రతి డ్రైవర్ గమనించాల్సింది ఒక క్షణం నిర్లక్ష్యం అనేక ఇళ్లలో విషాదాన్ని నింపగలదు





**మేడ్చల్(ప్రశ్న న్యూస్)** ఇటీవలి కాలంలో లారీలు, తిప్పర్లు నడిపే డ్రైవర్లు మాంద్యం తాగి మత్తులో వాహనాలు నడపడం పెరుగుతోంది. దీని వల్ల రోడ్డు మీద నడుస్తున్న అమాయక పాదచారులు, రెండు చక్రాల వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. గడిచిన కొన్ని వారాల్లోనే ఈ నిర్లక్ష్యం వల్ల అనేక ప్రాణాలు బలయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా కుటుంబ సభ్యులు రోడ్డుపై సురక్షితంగా తిరిగి ఇంటికి వస్తారా లేదా అన్న భయం మాకు ఎప్పుడూ ఉంటుంది. మాంద్యం తాగిన డ్రైవర్ల నిర్లక్ష్యం మా ప్రాణాలను బలితీసుకుంటోంది” అని బాధిత కుటుంబ సభ్యులు వాపోతున్నారు. మన రాష్ట్ర రహదారులపై లారీలు, తిప్పర్లు ఇష్టం వచ్చినట్లు నడపడం వల్ల ప్రతిరోజూ అమాయక ప్రజలు రోడ్డు ప్రమాదాలకు బలవుతున్నారు. పల్లెటూరి నుంచి పట్టణాల వరకూ ఎక్కడ చూసినా వేగం నియంత్రణ లేకుండా దూసుకుపోతున్న భారీ వాహనాలు మరణ మృదంగం మోగిస్తున్నాయి. ఇటీవల కొన్ని వారాల్లో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదాలు

### దీనికి నిదర్శనం..

తాజాగా చోటుచేసుకున్న పలు ఘటనల్లో బస్ స్టాండ్ దగ్గర, స్కూల్ ప్రాంతాల్లో, మార్కెట్ ప్రాంతాల్లో నిర్లక్ష్యంగా నడిపిన భారీ వాహనాలు చిన్నారులు, వృద్ధులు సహా పలువురి ప్రాణాలు బలికొన్నాయి. ఈ పరిస్థితి పట్ల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రమాదాల దృశ్యం..

స్కూల్ నుంచి ఇంటికి వెళ్తున్న చిన్నారిని లారీ ఢీకొని చంపిన ఘటన, మార్కెట్ ప్రాంతంలో కూరగాయలు అమ్ముకుంటున్న మహిళలపైకి దూసుకెళ్లిన ఘటన, రాత్రి వేళలలో తిప్పర్ బస్సును ఢీకొట్టి పలువురిని గాయపరిచిన ఘటన ఇవన్నీ సమాజాన్ని కలచివేస్తున్నాయి.

ఒక్కో ప్రమాదం వెనుక డ్రైవర్ నిర్లక్ష్యం, మద్యం మత్తు లేదా వేగం మితిమీరడం ప్రధాన కారణమని పోలీసులు చెబుతునా రు.

### ప్రజల ఆవేదన..

ప్రతి రోజు లారీ శబ్దం విన్నప్పుడు చాలా మంది భయంతో తడబడుతున్నారు. రహదారిపై నడుస్తున్నప్పుడు, స్కూల్ బస్సులు వెళ్లినప్పుడు తల్లిదండ్రుల గుండెల్లో భయం పెరుగుతోంది. “ప్రాణాలు పోతున్నా అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు? అమాయకులను రక్షించేది ఎవరు?” అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### ప్రభుత్వంపై ఒత్తిడి..

ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం, ట్రాఫిక్ పోలీసులను చర్యలకు దిగాలని కోరుతున్నారు. ఇప్పటికే అమలులో ఉన్న చట్టాలను మరింత కఠినతరం చేసి, లారీ డ్రైవర్లపై గట్టి పర్యవేక్షణ ఉండా డిమాండ్ చేస్తున్నారు.

## ప్రముఖ జర్నలిస్ట్ తేజవ్యాస్‌కు

# పితృ వియోగం

### నేడు మంచిర్యాలలోని స్వగృహంలో పెద్దకర్మ

### ఈనెల 19న తుది శ్వాస విడిచిన రాంచందర్

### క్యాన్సర్ వ్యాధి కారణంగా నాలుగేళ్లుగా వైద్య చికిత్సలు



**మంచిర్యాల (ప్రశ్న న్యూస్)** ప్రముఖ జర్నలిస్ట్ తేజవ్యాస్ కు పితృ వియోగం కలిగింది. ఈనెల మంగళవారం 19న రాంచందర్ పరమపదించారు. బుధవారం ఉదయం పట్టణంలోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇవాళ మంచిర్యాలలోని స్వగృహంలో పెద్ద కర్మ జరగనుంది. ఈ సందర్భంగా బంధు మిత్రులు హాజరై , తన తండ్రి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆయన కుమారులు జర్నలిస్ట్ అర్కటి తేజవ్యాస్ , అర్కటి గిరిప్రసాద్ కోరారు.

### - క్యాన్సర్ తోనే డ్యూటీకి వెళ్లిన రాంచందర్

సింగరేణి సంస్థలో సుదీర్ఘ కాలం పని చేసిన రాంచందర్, రామగుండం ఏరియా 2 రీజియన్ లో చివరిగా పని చేశారు. ఈ సందర్భంగా 4 ఏళ్ల కిందట ఉదార సంబంధిత క్యాన్సర్ వ్యాధికి గురి కావడంతో ఆయన కుటుంబం తీవ్ర ఆందోళన చెందింది. ఒకదశలో వాంతులతో , ఆహారం అరగలేని క్యాన్సర్ వ్యాధితో విధులు నిర్వర్తించారు. కాలక్రమేణ విధులు నిర్వర్తించలేని స్థితికి చేరుకోవడంతో 2022లో మెడికల్ అన్ ఫిట్ అయ్యారు. అయినప్పటికీ 3 సంవత్సరాలకుపైగా క్యాన్సర్ వ్యాధితో పోరాడారు. ఈ నేపథ్యంలో అనేక క్యాన్సర్ ఆస్పత్రులు తిరిగినా ప్రయోజనం లేక మంగళవారం మంచిర్యాల ఇంట్లోనే తుది శ్వాస విడిచారు.

## ఈ సమయంలో ఒలింపిక్స్ క్రీడల గురించి

# సమీక్ష చేస్తారా.?

### - రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రజలు భారీ వర్షాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, ముఖ్యమంత్రి మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. రోమ్ నగరం అగ్నికి ఆహుతవుతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించిన చందంగా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. భారీ వర్షాల కారణంగా కామారెడ్డి పట్టణానికి రోడ్డు మార్గాలన్నీ మూసుకుపోయి, బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఇటువంటి కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం ఆదుకోవాల్సింది పోయి, ఇతర అంశాలపై దృష్టి పెట్టడం దారుణమని అన్నారు. రాష్ట్రంలో మరో నాలుగు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినా, ప్రభుత్వంలో మాత్రం ఎలాంటి చలనం లేదని కేటీఆర్ ఆరోపించారు. క్లిష్ట సమయంలో ప్రజల సమస్యలను పరిష్కరించడం విస్మరించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒలింపిక్స్ నిర్వహణ, మూసీ నది సుందరీకరణ వంటి అంశాలపై సమావేశాలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, వర్ష ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున పరిహారం ప్రకటించాలని, రైతులకు ఎకరాకు రూ. 25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

# దుర్బర స్థితిలో సామాజిక ఆరోగ్య కేంద్రం

## - రోగుల మధ్య సంచరిస్తున్న విషపూరిత పాములు, తేళ్ళు

- ముధోల్ సామాజిక ఆరోగ్య కేంద్రపై చిన్నచూపు
- సెల్ పోన్ టార్చి లైట్ వెలుగులో రోగులకు చికిత్సలు
- పెచ్చులూడుచున్న పైకప్పు, గోడలు
- నిష్ణాతులైన సిబ్బంది ఉన్నను వసతల లేమితో వైద్య చికిత్సలకు అంతరాయం
-అర్ధాంతరంగా ఆగిపోయిన 30 పడకల ఆస్పత్రి నిర్మాణం
- నిర్మాణంలో ఉన్న ఆస్పత్రిని పూర్తి చేసి తమ ప్రాంత ప్రజలకు అధునిక వైద్య చికిత్సలు అందచేయాలి
- ప్రజా ప్రతినిధులు పట్టించుకోరు ప్రజల సమస్యలపై పట్టింపు లేదు
- స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు ఉండి ప్రజలకు కనీస ఉపయోగం కూడా కరువు





ముధోల్(ప్రశ్న న్యూస్) ప్రజారోగ్యంపై ప్రభుత్వం దృష్టి సారించి ఆస్పత్రులను అప్ గ్రేడ్ చేసినను వసతుల లేమితో రోగులకు వైద్యవసరాలు కల్పించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్న పరిస్థితులను నిత్యం చూస్తునే ఉన్నాము. ఇటీవల కురుస్తున్న అతి భారీ వర్షాలతో సీజనల్ వ్యాధుల విజృంభణతో రోగుల సంఖ్య పెరగడంతో ఆస్పత్రులన్ని కిటకిటలాడుచున్నాయి. నిర్మల్ జిల్లాలోని ముధోల్ ప్రభుత్వ కమ్యూనిటి హెల్త్ సెంటర్లో (సామాజిక ఆరోగ్య కేంద్రం) సరైన వసతులు లేక రోగులతో పాటు సిబ్బంది కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుచున్నారు. భారీ వర్షాలతో ఆస్పత్రి భవనం పూర్తిగా కురుస్తుండడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సిబ్బందితో పాటు రోగులు తీవ్ర విచారం వ్యక్తం చేసారు. భారీగా కురుస్తున్న వర్షాలతో చికిత్సలకై వచ్చే రోగులకు ఆస్పత్రిలో కనీసం నిల్చోవడానికి కూడా ఇబ్బందికరంగా మారింది. రోగులకు అనారోగ్య సమస్యలు వస్తే ఆస్పత్రికి వస్తారు, కాని ఆస్పత్రికే అనారోగ్య పరిస్థితులు దాపురిస్తే చికిత్సలు ఎవరు చేస్తారనే సందిగ్ధ పరిస్థతులు దాపురించాయి. సీజనల్ వ్యాధులతో భారినపడే రోగులు ఆస్పత్రికి క్యూ కడుతుండడంతో క్రమేపి రోగుల సంఖ్య పెరగుచు ప్రతి రోజు 400 నుండి 500 వరకు ఓ.పి ఉంటుందని వైద్య సిబ్బంది తెలిపారు. రోగులకు అవసరమయ్యే చికిత్సలు చేసేందుకు సరైన వసతులు లేనప్పటికి శ్రమకోర్చి ఉన్న వాటిలోనే పేద రోగులకు చికిత్సలు చేసేందుకు కృషి చేస్తున్నామని, అత్యవసర పరిస్థితుల్లో కనీసం విద్యుత్ సరఫర లేకపోవడంతో చీకటి అలమటించగా అలాంటి పరిస్థతులోను సెల్ పోన్ టార్చ్ లైట్ వెలుతురులో పనిచేయాల్సి వస్తుందని ఆస్పత్రి సిబ్బంది తమ గోడు వెళ్ళబోసుకున్నారు. ఇదిలాఉండగా రోగులకు పూర్తిగా స్వస్థత చేకూరే వరకు చికిత్సలు అందించాలనే దృడ సంకల్పంతో సిబ్బంది పని చేస్తున్నారని, రోగ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు సరైన వసతులు లేక పోయినను అరకొర వసతుల మద్య రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తు రోగులకు చికిత్సలు అందజేస్తు సీజనల్ వ్యాధుల నుండి ఉపశమనం కలిగిస్తున్న సిబ్బంది పనితీరును గ్రామ ప్రజలు అభినందించారు. ఇక ఆస్పతి భవనం పూర్తగా శిథిలావస్థకు చేరిందని, నూతనంగా నిర్మిస్తున్న 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం ఆర్ధాంతరంగా నిలిచి పోవడంతో గత్యంతరం లేని స్థితిలో శిథిలావస్థలో ఉన్న భవనంలోనే ఆస్పత్రిని నడపడం దురదృష్టకరమని పలువురు గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేసారు. ఇక ఆస్పత్రి గోడలు పెచ్చులూడి సిబ్బంది, రోగులపై పడే ప్రమాదం పొంచి ఉందని, దీనికి తోడు రోగుల మధ్య నుండే భారీ విషపూరితమైన పాములు, తేళ్ళు సంచరించడం చూస్తుంటే ప్రజల ప్రాణాలు రోగాలతో కాకుండా విషపూరిత పాములతో తేళ్లతో పోయేటట్లుగా ఉంది పరిస్థితి. ప్రజారోగ్యంపై, ఆస్పత్రుల స్థితిగతులు, వసతుల కల్పనపై ప్రభుత్వం గుప్పిస్తున్న ప్రకటనలు, హామీలు ఎక్కడ అమలవుచున్నాయో గాని తాము కనీస వైద్య సదుపాయాలకు కూడా నోచుకోలేక పోతున్నామని, తమ గ్రామంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం దుస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖా మంత్రి దామోధర రాజనర్సింహ్మ దృష్టి సారించి అర్ధాంతరంగా నిలిచిపోయిన ఆస్పత్రి భవనాన్ని వెంటనే పూర్తి చేసి తమ ప్రాంత ప్రజలకు అధునికి వైద్య సదుపాయాలను అందచేయాలని ప్రజలు కోరుచున్నారు. ఇంత దీనస్థితిలో ఉన్న ఈ ఆసుపత్రి పై కనీసం స్థానిక ఎమ్మెల్యే ఎంపీ ఏ రోజు పట్టించుకున్న దాఖలాలు లేవని ఇంత అద్వాన స్థితిలో ఉన్న ఈ ఆరోగ్య కేంద్ర సమస్యను ముఖ్యమంత్రి వెంటనే విర్చాలని ప్రజలు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588